మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



## మంత్రి పొన్నం సన్మాన సభలో పాల్గొన్న ఎమ్మెల్యే



మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

**నారాయణపేట ప్రతినిధి,డిసెంబరు 15 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సన్మాన కార్యక్రమానికి మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరై, మంత్రిని శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బడుగు బలహీన వర్గాల నుంచి సీనియర్ నేత అయిన పొన్నం ప్రభాకర్‌కు మంత్రి పదవి రావడం సంతోషకరమని తెలిపారు. కల్లుగీత కార్మికులకు తనవంతు సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసిన పిసిసి కల్లుగీత సంఘం అధ్యక్షుడు నాగరాజుగౌడ్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఇక మక్తల్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున గౌడసంఘం ప్రతినిధులు హాజరై మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సత్కరించారు. మాజీ ఎంపిపి బి. చంద్రకాంత్‌గౌడ్, బిసి ఐక్యవేదిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామాంజనేయులుగౌడ్, బిసి ఐక్యవేదిక ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. లింగంగౌడ్, గౌడ సంఘ నాయకులు కె. సత్యనారాయగౌడ్, కె.నరసిములుగౌడ్, ఆనంద్‌గౌడ్, మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

## అప్పుల పేరుతో పథకాల నుండి కాంగ్రెస్ తప్పించుకునే ప్రయత్నం..

**కాంగ్రెస్ ప్రభుత్వం సాకులు మాని ఇచ్చిన హామీలు ఎలా అమలు చేస్తుందో చెప్పాలి ...**

**మాజి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

**వనపర్తి ప్రతినిధి,డిసెంబర్ 15, ప్రభాతవార్త :** ఆర్థిక విధ్వంసం కాదు ఆర్థిక స్వాతంత్ర్యం తీసుకొచ్చామని అప్పుల పేరుతో పథకాల నుండి కాంగ్రెస్ తప్పించుకునే ప్రయత్నమని శుక్రవారం శాసనసభలో గవర్నర్ తమిళ్ సై సౌందర్ ప్రసంగాన్ని మాజి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఒక ప్రకటన ద్వారా తప్పుబట్టారు. గవర్నర్ ప్రసంగమా ఎన్నికల ముందు కాంగ్రెస్ మాట్లాడిన ప్రచార మాటలా కాంగ్రెస్ మ్యానిఫెస్టోనా మొత్తం గవర్నర్ ప్రసంగంలో తెలంగాణ ఈ పది సంవత్సరాలలో తిరోగమనంలో ఉంది అన్నట్లు చెప్పారని, అదే నిజమైతే మరి కేంద్ర ప్రభుత్వ నివేదికలు,ఆర్బిఐ, ఎన్ఐటిఉ ఆయుగ్య రిపోర్టు, యుఎన్ఓ మరియు ఇతర ప్రతిష్టాత్మక సంస్థలు ఇచ్చిన అవార్డులు,గుర్తింపులు దాచేస్తే దాగని సత్యాలుగా ఉన్నాయన్నారు. తెలంగాణ పండుతున్న పంటలు సత్యం, వస్తున్న కరెంటు సత్యం, పారులుతున్న నీళ్ల సత్యం పెరిగిన తలసరి ఆదాయం సత్యం, జరిగిన హైదరాబాద్ అభివృద్ధి సత్యం, గ్రామాలలో స్వచ్ఛత సత్యం, పట్టణాల సుం దరీకరణ సత్యం, తెలంగాణ దేశానికి తలమానికంగా ఉన్నదన్నది సత్యమన్నారు. అబద్దాలు చెప్ప దం వలన అభాసుపాలు కావడం తప్ప ఏమీ ఉండదని, తొమ్మిదిన్నరేళ్ల పాలన మీద బురద చల్లే 6 గ్యారెంటీల అమలు మీద కాంగ్రెస్ పార్టి శ్రద్ద వహిస్తే మంచిదని, విద్యుత్ శాఖ రూ 86 వేల కోట్ల అప్పులను చూపడం హాస్యాస్పదమన్నారు. పదేళ్లలో ఉచిత విద్యుత్ కోసం రూ 42 కోట్లు , రూ 26వేల కోట్లతో యాదాద్రి పవర్ ప్లాంట్, 6 నుండి 25 కు పెరిగిన 400 కెవి సబ్ స్టేషన్లు, 51 నుండి 103కు పెరిగిన 220 కెవి సబ్ స్టేషన్లు , 176 నుండి 250కి పెరిగిన 132 కెవి సబ్ స్టేషన్లు, 2138 నుండి 3250కి పెరిగిన 33/11 కెవి సబ్ స్టేషన్లు దాచేస్తే దాగని సత్యాలన్నారు. తెలంగాణ ఏర్పడే నాటికి 7778 మెగావాట్లు ఉన్న విద్యుత్ స్థాపిత సామర్థ్యం 2023 మే నాటికి 18567 మెగావాట్లకు పెంచుకున్న విషయం నిజం కాదా అని ఆయన ప్రశ్నించారు. రిజర్వ్ బ్యాంక్ నిబంధనలకు లోబడి అత్యంత తక్కువగా రుణాలు తీసుకున్న ప్రభుత్వం కెసీఆర్ ప్రభుత్వం అవునా కాదా అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాకులు మాని ఇచ్చిన హామీలు ఎలా అమలు చేస్తుందో చెప్పాలని రాష్ట్రాన్ని బాగు చేయకున్నా నష్టం చేయకుంటే చాలని ఆయన హితువు పలికారు.

## ఎమ్మెల్యేగా మీకు లేకున్నా ఆలన్నగా మీకు అండగా ఉంటా..

**స్థానిక ఎన్నికల్లో మన సత్తా చాటాలి**

**దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి**

**కార్యకర్తల సమావేశంలో భావోద్వేగంలో నాయకులు**

**కొత్తకోట,డిసెంబర్ 15,ప్రభాతవార్త :** ఎమ్మెల్యేగా మీకు లేకున్నా ఆలన్నగా మీకు అండగా ఉంటా స్థానిక ఎన్నికల్లో మన సత్తా చాటాలని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం కొత్తకోట మండల కేంద్రంలోని క్యూ ఆర్ గార్డెన్స్‌లో పట్టణ మండల బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన కార్యకర్తలు భావోద్వేగానికిలోనై కంటితడి పెట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇది వరకు ఉన్న జిద్దు ఇక నుంచి అలాగే ఉండాలే కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటా, అత్యంత స్వల్ప మెజార్టీతో ఒడిపోయాం నాయకులు కార్యకర్తలు సమన్వయంగా ఉండి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఇక నుండి ఆ తప్పు జరగకుండా జాగ్రత్త పడదాం అని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. ఒక ఎమ్మెల్యే పదవి తప్ప అన్ని పదవులు మనమే ఉన్నాం రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. పదవి లేకపోవచ్చు నాకు కానీ ఆల వెంకటేశ్వర్ రెడ్డి అనే వ్యక్తి మీ మధ్యనే కేసీఆర్ నాయకత్వం లో ఉంటారని తెలిపారు. ఇప్పుడు ఉద్యమస్ఫూర్తి మనకు చాలా అవసరం గ్రామపంచాయతీ ఎన్నికల్లో మీరంతా కసి మీద పని చేయలే జరిగిపోయిన నష్టాన్ని స్థానిక ఎన్నికల్లో సరిచేసుకుందామని సూచించారు. ఏ గ్రామానికి వెళ్లిన మనం చేసిన అభివృద్ధి కండ్లకు కనిపిస్తుందని అందరం కలిసి మన అభివృద్ధి పనులను వివరిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండకడదామని అన్నారు. స్థానిక ఎన్నికల్లోనే మీ గ్రామ నాయకులు అందరూ కలిసి అభ్యర్థులను మీరే ఎంపిక చేసుకొని నా దగ్గరకు రండని అన్నారు. ఉద్యమకారులను కలుపుకొని పని చేయాలని కోరారు. ప్రతి కార్యకర్తలకు అండగా నేను ఉన్న ఏఆపద వచ్చిన నేను ఆదుకుంటా అని ధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో కాటం ప్రదీప్ గౌడ్, జడ్పీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, మున్సిపల్ చైర్ సర్సన్ పొగాకు సుకెసిని, సీడీసీ చైర్మన్ చెన్నకేషవ రెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే


## నెలాఖరులోగా జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు..

**తగిన ఏర్పాట్లు చేయాలి: డీఈఓ రవిందర్**

**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబరు 15 ప్రభాతవార్త :** జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు జిల్లా కలెక్టర్ అనుమతి మేరకు ఈనెల చివరి వారంలో జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించుటకు గాను తగిన ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. రవిందర్ ఆదేశించారు. శుక్రవారం ఆర్విఎం సమావేశ మందిరంలో పాఠశాలల హెడ్మాస్టర్లకు నిర్వహించిన అవగహన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులలో గల సృజనాత్మక శక్తిని వెలికితీసి వారిలోని ఆలోచన శక్తిని, సైన్స్ పరిజ్ఞాన పరిశీలనా నైపుణ్యాన్ని,ప్రయోగ నైపుణ్యాలను పెంపొందిస్తూ, భావి శాస్త్రవేత్తలను తయారు చేయడానికి అవకాశం కలిగించే జిల్లాస్థాయి విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన డిసెంబర్ చివరి వారంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, రెసిడెన్షియల్ స్కూల్స్, మోడల్ స్కూల్స్, కెజిబివి, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు క్రింద తెలియపరిచిన అంశాల వారిగా విద్యార్థులు సంసిద్ధులను చేయవలసిందిగా సూచించారు. ప్రధాన అంశంగా సమాజం కోసం శాస్త్ర సాంకేతిక విద్య, ఉప అంశాలుగా ఆరోగ్యం, పర్యావరణ రహిత జీవన విధానం, వ్యవసాయం, కమ్యూనికేషన్ రవాణా, గణన నైపుణ్యం పొందుపరిచారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో గల 6,12వ తరగతి చదివే విద్యార్థుల నుండి పైన తెలిపిన అంశాల నుండి ఉన్నత పాఠశాల నుండి ఏవేని రెండు ప్రదర్శనలు, ప్రాథమికోన్నత పాఠశాల నుండి ఒక ప్రదర్శన తప్పక తీసుకురావాలని జిల్లా విద్యాశాఖ అధికారి తెలియజేశారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శన (సైన్స్ ఫెయిర్)లోనే గత విద్యా సంవత్సరం 2022,23నకు ఎంపికైన 59 ఇన్స్‌పెక్టర్ అవార్డ్సు ప్రదర్శనలు (లిస్ట్ నందు ఎంపికైన విద్యార్థుల ప్రదర్శనలు) కూడా ప్రదర్శించవలెనని జిల్లా విద్యాశాఖ అధికారి సూచించారు. వైజ్ఞానిక ప్రదర్శనతో పాటు విద్యార్థులకు సెమినార్‌ను కూడా నిర్వహిస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి బి. శ్రీనివాసులు సెల్ నంబర్ 8897155001ను సంప్రదించాలని కోరారు.

## సాందీపని ఆవాసంలో బిసి జన్మదిన వేడుకలు..

**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబరు 15 ప్రభాతవార్త :** వీసీ ప్రొఫెసర్ ఎల్‌బి లక్ష్మీకాంత్ రాథోడ్ పుట్టినరోజు తమ కూతుళ్ళ కోరిక మేరకు సాందీపని ఆవాసంలో జరుపుకున్నారు. చిన్నారులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పండ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా విద్యార్థులకు సొంత ఖర్చులతో పడుకోవడానికి మంచాలు, బట్టలు, వస్తువులు దాచుకోవడానికి కబోర్డ్స్ వంటివి త్వరలోనే అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సాందీపని ఆవాసం బృందం బాలయాదవ్, కార్యదర్శి చంద్రయ్య యాదవ్, ఉపాధ్యక్షులు శర్వన్న, కోశాధికారి ఆంజనేయులు, కమిటి సభ్యులు కాశినాథం, అవస ప్రముఖ్, రమేష్, సహ ప్రముఖ్, పీయూ నాన్ టీచింగ్ బృందం పాల్గొన్నారు.



# సర్పంచ్‌ల సమరం..!

**జనవరిలో జరుగుతాయని ప్రచారం**

**ఏర్పాట్లలో అధికారం యంత్రాంగం**

**పోటీకి సిద్ధమవుతున్న నేతలు**



ఉండవెల్లి మండల గ్రామ పంచాయతీ కార్యాలయం

**ఉండవెల్లి,డిసెంబరు 15 ప్రభాతవార్త :** అసెంబ్లీ ఎన్నికల సమరం నుంచి ఇంకా పూర్తిగా తేరుకోక ముందే సర్పంచ్ ఎన్నికలపై ఊహాగానాలు ఊపందుకుంటున్నాయి. జనవరి 31, 2024తో ప్రస్తుత గ్రామ పంచాయతీ పాలక వర్గాల పదవికాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలతో జిల్లా పంచాయతీ శాఖ ఎన్నికల ఏర్పాట్లపై నిమగ్నమైంది. మరోవైపు జనవరి 31, 2019న గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించి ఫిబ్రవరి 2న పదవి బాధ్యతలు స్వీకరించిన సర్పంచ్‌లు, వార్డు సభ్యులు తమకు చెప్పరు ఆరు నెలలు ఆలస్యంగా ఇచ్చినందున మరో ఆరు నెలల తర్వాత ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇదిలా ఉంటే జనవరిలో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారని డిసెంబర్ చివరి వారంలో షెడ్యూల్ విడుదల చేసి జనవరి 7న నోటిఫికేషన్ వస్తుందనే వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో గ్రామాల్లో నాయకులు ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. అయితే గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించడం ప్రభుత్వం తీసుకుని నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుందని సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు ఊహాగానాలేనని కొందరు చెబుతున్నారు. నవంబర్ 30 అసెంబ్లీ ఎన్నికలు జరగగా డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక స్థానాలు గెలుపొంది రాష్ట్రంలో కొత్తగా రేవంత్‌రెడ్డిలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు కూడా కాకముందే సర్పంచ్ ఎన్నికలు జనవరిలో జరుగుతాయని వస్తున్న వార్తలతో గ్రామాల్లో అప్పుడే మళ్లీ ఎన్నికల వాతావరణం నెలకొన్నది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ప్రభుత్వం ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తే ఎన్నికలను నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నది.

**ఏర్పాట్లలో అధికార యంత్రాంగం...**

నిర్ణీత వ్యవధి ప్రకారం గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణ దిశగా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేపట్టింది. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అవసరమైన ప్రక్రియను అధికారులు కొనసాగిస్తున్నారు. ఆయా పంచాయతీల వారిగా గతంలో అనుసరించిన రిజర్వేషన్ల వివరాలను ఇదివరకే మండలాల వారిగా పంపించారు. ఈసారి అందుబాటులో ఉన్న ఓటరు జాబితాను సరిచేసే పనిలో సిబ్బంది ఉన్నారు. ఇటీవల శాసనసభ ఎన్నికల సమయంలో పంచాయతీల వారిగా ఓటర్లలో చాలామంది మరణించిన వారిని తొలగించలేదు. పైగా కొన్నిచోట్ల కొత్తగా ఓటర్లు చేరాల్సి ఉంది. ఇందుకోసం ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం తుది జాబితాను సిద్ధం చేయనున్నారు.

**పెండింగ్ బిల్లులు చెల్లించే వరకు పర్సన్ ఇంఛార్జిలుగా కొనసాగించాలి...**

సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు సురవరం లోకేష్‌రెడ్డి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో చాలా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆ బిల్లులు చెల్లించే వరకు ఎన్నికలను నిర్వహించకుండా పర్సన్ ఇంఛార్జిలుగా కొనసాగించాలి. అలాగే చెక్ పవర్ కూడా ఆరు నెలలు ఆలస్యంగా ఇచ్చారని దీనిపై త్వరలోనే సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కను, ముఖ్యమంత్రిని కలిసి వినతి పత్రం సమర్పిస్తాం. ఇప్పటికే తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.

## తైబజారు పేరుతో మున్సిపాలిటీ

# ఆదాయానికి గండి...

**పట్టించుకోని మున్సిపల్ కమిషనర్**

**నారాయణపేట ప్రతినిధి,డిసెంబరు 15 ప్రభాతవార్త :** మక్తల్ మున్సిపాలిటీలో అధికారులు ఆడిందే ఆట పాడిందే పాట అందిన కాడికి దోచుకోవడమే వాళ్లపని అన్నట్లు మక్తల్ మున్సిపాలిటీ కమిషనర్ తీరు కనబడుతుంది. మక్తల్ మున్సిపాలిటీలో 2023,2024కు గాను తైబజార్ వేలంపాటను నిర్వహించారు. ఈ వేలం పాటకుగాను సాయిరాం అనే వ్యక్తి రూ. 11 లక్షల 50 వేలకు వేలం పాటలో దక్కించుకున్నారు వేలం పాటలో పాల్గొనదలచినప్పుడు రెండున్నర లక్షల డిడిని మున్సిపల్ కార్యాలయంలో చెల్లించాలి. అనంతరం వేలం పాటలో పాల్గొనాలి. వేలం పాటలో పాల్గొనే సమయంలో డిడిని వారు చెల్లించారు. వేలంపాటలో దక్కించుకున్న మొత్తాన్ని మూడు విడతల వారిగి మున్సిపాలిటీకి చెల్లించాలి. అనగా మూడు లక్షల రూపాయల చొప్పున మూడు నెలలకు ఒకసారి చెల్లించాలనే మున్సిపాలిటీ చట్టం ప్రకారం కమిషన్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో నీటిపన్ను, ఇంటిపన్ను పేరుతో నెల నెల ముక్కు పిండి వసూలు చేస్తూ వారి సిబ్బంది వసూలు చేస్తారు. అయితే స్థానిక కమిషనర్ కొంతమంది రాజకీయ నాయకుల ప్రోద్బలంతో వారు చెప్పిన విధంగా కమిషన్ అమలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ గుత్తేదారు చెల్లించిన డిడిని సైతం దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సమయం అయిపోయిందని సదరు గుత్తేదారుకు డిడిని తిరిగి వెంటనే రిటన్ ఇచ్చేశారు. అనంతరం సదరు గుత్తేదారు సమాచారం మేరకు 4.80 వేల రూపాయలు మున్సిపాలిటీకి ఇప్పటి వరకు చెల్లించినట్లు ఓ అధికారి తెలిపారు. మార్చి 2023 నుంచి మార్చి 2024 వరకు వారి సంవత్సర కాలానికి ఇంకా మూడు నెలల సమయం ఉంది. ఇప్పటివరకు వారినుంచి మిగతా అనగా 6 లక్షల 20 వేల రూపాయలను మున్సిపల్ కమిషనర్ వసూలు చేయకుండా స్థానిక కొంతమంది నాయకులతో కుమ్మక్కై ఆ డబ్బులను వసూలు చేయడం లేదని కొందరంటున్నారు. ఇకనైనా మున్సిపల్ కమిషనర్ స్పందించి ఆ గుత్తేదారు నుంచి డబ్బులు వసూలు చేయిస్తారా లేదాఅని అదేవిధంగా జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి వారి నుంచి డబ్బులు వసూలు చేయడం కొరకు కిందిస్థాయి కమిషనర్‌పై ఒత్తిడి తీసుకురావాలని మున్సిపాలిటీ ప్రజలు కోరుతున్నారు. అధికారులు స్పందిస్తారా లేదా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



మక్తల్ మున్సిపల్ కార్యాలయం

## ఎల్‌పిజీ,మహాలక్ష్మి,200యూనిట్ల ఉచిత విద్యుత్తులకు విధి-విధానాలు జారీ చేయాలి..!!

**భూత్పూర్,డిసెంబర్ 15,ప్రభాతవార్త :** ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలతో ప్రజల ముందుకు వచ్చి దశాబ్ద కాలం పాటు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదించి,రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బలపరిచిన తెలంగాణ ప్రజలు తమకు కాంగ్రెస్ ప్రభుత్వం రు.500లకే ఎల్‌పిజీ సిలెండర్,తెల్లరేషన్‌కార్డు కల్గి 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రు.2,500ల ఫింఛన్ వస్తుందని కొండంత ఆశతో ఉన్నారు. సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అంచెలంచెలుగా ఒక్కొక్కటిగా నెరవేస్తు వస్తోంది. ఈ నేపథ్యంలో ఆర్టీసీలో మహిళలు,బాలికలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ జన్మదినం ఈ నెల 9నుంచి ఆర్టీసి లగ్జరి,డీలెక్స్ బస్సులను మినహాయించి మిగిలిన అన్ని రకాల సర్వీసులలో వీరిని ఉచిత ప్రయాణానానికి అనుమతిస్తున్నారు. ఇదివరకు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న తెల్లరేషన్‌కార్డు హోల్డర్లకు కార్పొరేట్ ఆసుపత్రులలో రు.ఐదు లక్షల వరకు పరిమితి ఉన్న రాజీవ్ ఆరోగ్య శ్రీ వ్యవ పరిమితిని రు.10లక్షలకు పెంచుతూ రెండు బృహత్తర పథకాల అమలుకు సీఎం రేవంత్‌రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టిన మరుక్షణమే ఈ రెండు పథకాల ఫైళ్లపై తొలి సంతకాలు చేశారు. అమలు చేస్తున్న రెండు పథకాలలో ఒకటి మాత్రం అంటే ఆర్టీసీ బస్సులలో ఉచితంగా మహిళలు,బాలికలు గడిచిన వారం రోజులుగా ప్రయాణిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా తెల్లరేషన్‌కార్డు కలిగిన మహిళల కోసం కాంగ్రెస్ ప్రకటించిన రు.2500లు నెలసరి ఫింఛన్,గృహవసరాలకు వినియోగించే రు.500లకే ఉచిత సిలెండర్,200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు వంటి బృహత్తర పథకాలకు ఇంతవరకు విధివిధానాలు,నియమనిబంధనలు ఖరారు చేయకపోవడంతో లబ్ధిపొందే వినియోగదారులు ఈ పథకాల అమలు,వాటిపై ప్రభుత్వ మార్గదర్శకాల కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వం రైతు బంధు,రైతు బీమా వంటి పథకాలను ప్రవేశపెట్టి రైతు ప్రధాన పథకాలను అమలు చేస్తే,ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో అరు గ్యారంటీలతో అధికారం చేపట్టిన సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమమే ప్రధానంగా పథకాలను అమలు చేస్తోందన్న అభిప్రాయం రాజకీయ విశ్లేషకుల నుంచి బాహాటంగా వినవస్తోంది. అయితే కాంగ్రెస్ ప్రకటించిన రు.500లకే ఎల్‌పిజీ ఉచిత సిలెండర్,నెలనెలా ఇచ్చే రు.2,500ల మహాలక్ష్మి ఫింఛన్,200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు పథకాల ధరఖాస్తు చేసుకునేందుకు విధివిధానాలు, మార్గదర్శకాలను ఇదమిత్తంగా స్పష్టమైన ఆదేశాలను ప్రభుత్వం నేటివరకు జారీ చేయకపోవడంతో లబ్ధిపొందాలనుకునే మహిళలు, వినియోగదారులు ప్రభుత్వ ప్రకటన కోసం ఎదురు చూస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తక్షణం స్పందించి ఈ పథకాల అమలు కోసం స్పష్టమైన విధి విధానాలు,మార్గదర్శకాలను వెంటనే జారీ చేయాలని మహిళలు,వినియోగదారులు కోరుతున్నారు.

## శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిసిన ఎన్ఎస్‌యు నాయకులు..

**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబరు 15 ప్రభాతవార్త :** శాసనసభ నూతన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను జిల్లా ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు మహ్మద్ అవేజ్ అహ్మద్‌తో పాటు ఇతర నాయకులు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్పీకర్‌కు పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కలకు పుష్పగుచ్చాలు అందజేసి శాలువాలతో సన్మాన చేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తమవంతు కృషి చేయాలని అవేజ్ అహ్మద్ వారికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు అబ్దుల్ నయీమ్ సద్దాం, టిపిసిసి కార్యదర్శి సందీప్, రాష్ట్ర నాయకులు విజయ్ యాదవ్, కర్ణం సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శులు నవాజ్, సమీర్,నాయకులు ముహిబ్, అంజద్ పాల్గొన్నారు.

## మళ్లీ షురూ..!

**కోడు ముగియడమే ఆలస్యం బెల్టు షాపులకు తెరుచుకున్న ద్వారాలు**

**60 నుంచి 70 శాతం విక్రయాలు వీటి ద్వారానే**

**ఒక్కో మండలంలో 100కు పైగా షాపులు**

**ఉండవెల్లి,డిసెంబరు 15 ప్రభాతవార్త :** గ్రామాల్లో మళ్లీ బెల్టుషాపులు మొదలయ్యాయి. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో బెల్టు షాపులను సమర్థవంతంగా కట్టడి చేసిన అధికారులు ఆ తర్వాత గాలికి వదిలేశారు. దీంతో గ్రామాల్లో మద్యం ఏరులై పారుతుంది. ఎన్నికల వేళ దాదాపు రెండు నెలల వ్యవధిలో పోలీసులు ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి బెల్టు షాపుల నిర్వాహకులపై వందల సంఖ్యలో కేసులు నమోదు చేసి బైండోబర్లు చేశారు. దాదాపు మూడు, నాలుగు వేల లీటర్లకు పైగా మద్యాన్ని సీజ్ చేశారు. కోడ్ ముగియగానే దాడులను ఆపేశారు. ప్రస్తుతం గ్రామాల్లో కిరాణా దుకాణాల కంటే బెల్టు షాపులే అధికాంగా ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. అయితే షాపుల నిర్వహణ మొత్తం ఎక్సైజ్‌శాఖ కనుసన్నల్లోనే జరుగుతుం దనేది బహిరంగ రహస్యం. మద్యం ప్రియుల కారణంగా గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతున్న పోలీసులు పట్టించుకోవడం పలు విమర్శలకు తావిస్తోంది.



**చిత్తశుద్ధితో పనిచేస్తే బెల్టు షాపులను నియంత్రించేలేరా..?**

అయితే ఒక్కో క్వార్టర్ నుంచి ఆఫ్ బాటిల్, ఫుల్ బాటిల్ అమ్మకాల్లో ఎమ్మార్పీ కంటే రూ. 10 నుంచి రూ. 50 వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఎప్పుడైనా బెల్టు షాపుల నిర్వాహకులను పోలీసులు అరెస్టు చేస్తే మద్యం దుకాణదారులు వారికి రక్షణగా నిలుస్తున్నారు.

**కిరాణా షాపుల కంటే అధికం...** గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తుండడంతో అమ్మకాలు నాలుగింతలు పెరిగినట్లు స్పష్టమవుతుంది మండంలో ఏ గ్రామానికి వెళ్లిన కిరాణ దుకాణాల కంటే బెల్టు షాపులే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఒక్కో ఎక్స్ఛేంజ్ తన పరిధిలో 300 వరకు బెల్టు షాపులు ఉన్నట్లు సమాచారం. మద్యం దుకాణాల్లో 30 శాతం గిరాకీ ఉండగా బెల్టు షాపుల ద్వారా 70 శాతం వ్యాపారం జరుగుతున్నట్లు తెలిసింది. ఒకప్పుడు రోజుకు లక్ష అమ్మకాలు దాటిన షాపులో నేడు ఐదునుండి పది లక్షలు దాటిసేల్స్ ఉంటున్నాయి.

## 18న పడిపూజ..!

**జ్ఞానజ్యోతి అయ్యప్ప ధర్మప్రచార సమితి ఆధ్వర్యంలో నిర్వహణ**

**భక్తులందరూ పాల్గొని విజయవంతం చేయాలి**

**వ్యవస్థాపకులు మనోహర్‌శాస్త్రి వెల్లడి**



పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్వాములు

**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబరు 15 ప్రభాతవార్త :** ఈనెల 18వ తేదీన జ్ఞానజ్యోతి అయ్యప్ప ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపకులు మనోహర్‌శాస్త్రి తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వేపూరిగేరి ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో మనోహర్‌శాస్త్రి తెలిపారు. లోకకళ్యాణం కోసం జ్ఞానజ్యోతి అయ్యప్పధర్మ ప్రచార సమితి వ్యవస్థాపకులు మనోహర్ శాస్త్రి అయ్యప్ప పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పూజా కార్యక్రమాన్ని శబరి అయ్యప్పస్వామి ఆలయం



శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిసిన ఎన్ఎస్‌యుఐ నాయకులు

## రూ.3339 ధర పలికిన శ్రీరాంగోల్డ్ ధాన్యం..

**రూ.9610 ధర పలికిన కింటాల్ కందులు**

**దేవరకద్ర,డిసెంబరు 15 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయమార్కెట్ యార్డుకు శుక్రవారం రైతులు 14 క్వింటాళ్ళ శ్రీరాంగోల్డ్ ధాన్యాన్ని విక్రయానికి తీసుకవచ్చారు. వీటికి అత్యధికంగా క్వింటాలుకు రూ.3339 ధర పలికింది. అతి తక్కువగా కూడ అంతే ధర పలికింది.అలాగే రైతులు 107 కింటాళ్ల ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యాన్ని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు.వీటికి అత్యధికంగా కింటాల్‌కు రూ.3259 ధర పలికింది.అతి తక్కువగా రూ.3223 ధర పలికింది.అలాగే 4 కింటాళ్ళ ప్యాడి హంస ధాన్యాన్ని విక్రయానికి తీసుకవచ్చారు.వీటికి అత్యధికంగా కింటాలుకు రూ.2001 ధర పలికింది. అలాగే అతితక్కువగా కూడ అంతే ధర పలికింది.1 కింటాళ్ళ కందులను రైతులు విక్రయానికి తీసుకవచ్చారు.వీటికి అతి ఎక్కువగా కింటాల్‌కు రూ.9610 ధర పలికింది.అలాగే అతితక్కువగా కూడ అంతే ధరపలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## 24 నుండి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు..

**-26న స్వామి వారి రథోత్సవం**



**దేవరకద్ర,డిసెంబరు 15 ప్రభాతవార్త:** జిల్లాలోని ప్రధాన దేవాలయలో ఒకటైన దేవరకద్ర మండలం చిన్నరాజమూర్‌లోని శ్రీ ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 24న ప్రారంభం కానున్నాయి.ఈ నెల నుండి 28 వరకు ఉత్సవాలు ఘనంగా జరుగనున్నాయి. అయినప్పటికి దాదాపు నెల రోజుల పాటు భక్తులు స్వామి వారి దర్శనానికి తరలివస్తుంటారు.ప్రతి ఏడాది స్వామి వారు ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి.అందులో భాగంగానే ఈఏడాదికూడ స్వామివారి ఉత్సవాలకు నిర్వహకులు అన్నిఏర్పాట్లు చేశారు.ఉత్సవాలలోని ప్రధాన ఘట్టమైన స్వామి వారి రథోత్సవం 26న జరుగనుంది.దీనికిగాను దేవస్థానంవద్ద భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లుచేస్తున్నట్లు దేవస్థానం వ్యవస్థాపకవంశీయులు,అర్చకులు,మేనేజర్ తెలి పారు. స్వామి వారి ఉత్సవాలకు జిల్లా నుండే గాక ఇతర రాష్ట్రాలనుండి భక్తులు అధికసంఖ్యలో హాజరవుతారు.ఉత్సవాలకు దేవరకద్ర నుండి చిన్నరాజమూర్ వరకు ప్రత్యేక బస్సులను నడుపుతుంది.

## శ్రీ సత్యసాయి సేవాసమితి కన్వీనర్‌గా గంగుల శ్రీనివాస్‌రెడ్డి



**అడ్డాకుల,డిసెంబరు 15 ప్రభాతవార్త :** అడ్డాకుల మండల కేంద్రంలో శ్రీ సత్యసాయి సేవ సంస్థకు గత 25 సంవత్సరాల నుండి కె.మహేందర్‌రెడ్డి సాయిరాం సత్యసాయి సంస్థకు నిర్విరామంగా విశిష్ట సేవలు ఎన్నో అందించారు. సాయిరాం వయసు పై పడటం వలన పాలక మండల సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ సత్యసాయి సమితి కొత్త కన్వీనర్‌గా ఉపసర్పంచ్ గంగుల శ్రీనివాస్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. సత్యసాయి సేవ సమితి కొత్త కన్వీనర్‌గా ఉపసర్పంచ్ గంగుల శ్రీనివాస్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. సత్యసాయి సేవా సంస్థకు ఎన్నో విశిష్ట సేవలందించిన సాయిరాం గారికి భగవాన్ శ్రీ సత్యసాయి బాబా ఆశీస్సులు ఎల్లవేళలా ఆయురారోగ్యాలు ప్రసాదించాలని గంగుల శ్రీనివాస్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో పాలక భజన మండలి సభ్యులు ఏలుసరి మురళి, దాసరి రాములు, బి.అచ్యుతారెడ్డి, వడ్డె శ్రీనివాసులు, కేశవులు, ఈర్ల రాములు, బి.బాలకృష్ణారెడ్డి, ఎం.బాలకృష్ణారెడ్డి, భజన బృంద సభ్యులు పాల్గొన్నారు.

## లోక్‌సభ ఎన్నికల పోలింగ్ బూతుల పరిశీలన..




**బిజినేపల్లి,డిసెంబరు 15 ప్రభాతవార్త :** లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ బూతులను శుక్రవారం తహసిల్దార్ జనుంపల్లి శ్రీరాములు పరిశీలించారు. మండలంలో పర్యటించి క్షేత్ర పరిశీలన చేసి అవసరమైన చోట నూతనంగా బూతుల ఏర్పాటుకు మౌలిక సదుపాయాలను పరిశీలించారు. లట్టుపల్లి గ్రామ శివారులోని ఊడుగుల గుంట, నల్లచెరువు, బొరుసుగడ్డ తండాల్లో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాటు చేసిన పోలింగ్ చేసిన పోలింగ్ బూత్‌లతో పాటు ఇతర ప్రభుత్వ భవనాలను ఎన్నికల నిర్వహణకు అనువుగా ఉన్నట్లయితే వాటిని ఉన్నతాధికారులకు నివేదిక ద్వారా అందించనున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు వచ్చే అధికారులకు, ఓటర్లకు ప్రయాణానికి అనువుగా ఉండే పోలింగ్ కేంద్రాలను క్షేత్ర పరిశీలనలో గుర్తించనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఎంఆర్ఐ బాలరాజు, బిఎల్ఓలు ఉన్నారు.

## చనిపోయి నలుగురుని బతికించడం గొప్ప విషయం

**మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి**



**కొత్తకోట,డిసెంబర్ 15,ప్రభాతవార్త :** చనిపోయిన వ్యక్తి మరో నాలుగురుని బతికించడం గొప్ప విషయమని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు.కొత్తకోట మండలం కానాయపల్లి గ్రామానికి చెందిన నక్కల రాములు ఇటీవల రోడ్ ప్రమాదంలో తలకు తీవ్ర గాయలై యశోద హాస్పిటల్ లో బ్రెయిన్ డెడ్ తో చనిపోవడం జరిగింది.చనిపోయిన వ్యక్తి అవయవాలు దానం చేసి ఆదర్శంగా నిలిచారు.చికిత్స ఖర్చులు సుమారు 2 లక్షల 50 వేలు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి మాఫీ చేయించారు.శుక్రవారం కానాయపల్లిలో జరగనున్న అంత్యక్రియలకు మాజీ ఎమ్మెల్యే ఆల హాజరై మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.వీరితోపాటు జడ్పీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్,సీడీపీ చైర్మన్ చెన్నకేషన్ రెడ్డి,గాడిల ప్రశాంత్,ఉద్యమకారులు శేఖర్ గౌడ్, నక్కల శాంతన్న,వైస్ ఎంపీపీ వడ్డే శ్రీనివాసులు,రఘువర్ధన్ రెడ్డి,నారోత్తం రెడ్డి,ఉప్పరి యాదన్న, గ్రామ అధ్యక్షుడు హొటల్ రాజు,కుర్మయ్య,రవీందర్ గౌడ్,ధనుష్,మొగులయ్య,నక్కల చిన్న నర్సింహ,బాబు,కిరణ్,మహేష్,వికాస్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వాలి..

**అమరచింత,డిసెంబర్ 15,ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వాలని అఖిల భారత విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సా యికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం అమర చింత మండల కేంద్రంలోని జడ్పి హెచ్‌ఎస్ పాఠశాల,బాలికల పాఠ శాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,అమరచింత మండలంలోని అనేక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సరైన భోజనం ఇవ్వడం లేదని అలాగే విద్యార్థులకు తాగునీరులేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం విద్యపై దృష్టి సారించి ఆయా పాఠశాలలో ఉన్న మౌలిక సమస్యలను పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వం తక్షణమే భర్తీ చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.విద్యార్థుల సమస్యల పరిష్కరించకుంటే ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉద్యమల సిద్ధమవుతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏబీవీపీ అమరచింత మండల కన్వీనర్ అఖిల్,ఏబీపీ నాయకులు రాజేష్,సందీప్,భరత్,ఉదయ్ గౌడ్,ఆంజనేయులు,రవి వర్మ,భరత్,మహేష్,మనీ,అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**బిజినేపల్లి,డిసెంబరు 15 ప్రభాతవార్త :** లట్టుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం రాములు గుండెపోటుతో మరణించడంతో బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. న్యాయవాది గడ్డికోపుల చేతన్ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియపరిచారు. తనవంతు సహాయంగా రూ. 5 వేల ఆర్థిక సహాయం అందించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో రామచంద్ర్య, బంగారు రాజు, షాలూమ్ స్టాన్లీ తదితరులు పాల్గొన్నారు.



# వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా బండలాగుడు పోటీలు..

**మల్దకల్ డిసెంబర్ 15, ప్రభాతవార్త:** మల్దకల్ మండల కేంద్రంలో ఈ నెలలో జరగనున్న శ్రీ మల్దకల్ తిమ్మప్ప స్వామి దేవాలయం, గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బండలాగుడు పోటీలు విజయవంతం అవుటకై శుక్రవారం బిఆర్‌ఎస్ నాయకులు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎంపీపీ వై.రాజారెడ్డి, జడ్పీటీసీ వై.ప్రభాకర్‌రెడ్డఇ, సింగిల్ విండో అధ్యక్షుడు ఎస్.తిమ్మారెడ్డి, జిల్లా బిఆర్‌ఎస్ నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వెంకటన్న, సర్పంచు యాకోబు, ఎంపీటీసీ లక్ష్మన్న, మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆనాదిగా వస్తున్న శ్రీ స్వయంభూ వెంకటేశ్వర బ్రహ్మోత్సవాలను పార్టీలకతీతంగా ఘనంగా నిర్వహిద్దామన్నారు. ఈ సంవత్సరంలో ఇటీవల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో గద్వాల నియో జకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే గెలుపొందారు. ఈ పోటీలను గ్రామ పంచాయితీ సర్పంచు ఉన్నవారే నిర్వహించాల్సి ఉండగా అధికార పార్టీ కాంగ్రెస్ నాయకులు పోటీలు తామే నిర్వహిస్తామని తమ పార్టీ అధికారంలో ఉందని గ్రామంలో చిచ్చురేపడం సరియైనది కాదని అన్నారు. వార్డు మెంబర్ నుండి ఎమ్మెల్యే స్థాయి వరకు ఉన్న మేము పోటీలు నిర్వహించడానికి మాకు అర్హత ఉన్నదని బిఆర్‌ఎస్ పార్టీ జిల్లా, మండల నాయకులు అన్నారు. మండలంలోని ఏ పదవి లేనివారు పోటీలు ఎలా నిర్వహిస్తారని మీకు దమ్ము, ధైర్యం ఉంటే ఏమైనా పదవులు ఉండి ఉంటే పోటీలు నిర్వహిస్తు బాగుంటుందని వారు హెచ్చరించారు. గత ఎన్నికలలో బహుజన వాదంతో ఓట్లు అడిగారు. గ్రామ ప్రథమ పౌరుడు దళిత సర్పంచు ను అవమానించిన సమయంలో మీ వాదం, బహుజన వాదం ఎలా అవుతుందని ఒక బహుజన నాయకుడి పట్ల ఉండే నిబద్ధత ఇదేనా అంటూ ఘాటుగా ప్రశ్నించారు. డబ్బులున్నాయని అధికార అహంకారంతో దళిత సర్పంచును అవమానపరిస్తే కర్కుకాల్చి వాతపెడతామని హెచ్చరించారు. గతంలో ఎమ్మెల్యే అరుణమ్మ గెలిచిన సమయంలో అప్పటి టిఆర్ఎస్ ప్రభుత్వ అధికారం ఉన్నప్పుడు మల్దకల్ గ్రామ సర్పంచుగా దామా నాగరాజు ఉన్న సమయంలో సర్పంచు హోదాను గౌరవించి పార్టీలకతీతంగా రైతు సంబరాలు ఘనంగా నిర్వహించామని గుర్తుచేశారు. పార్టీ మారినా కానీ ఇంకా జడ్పీచైర్మన్ స్థాయిలో ఉన్నారంటే కేసిఆర్ భిక్ష అని అన్నారు. అదే విధంగా శ్రీస్వయంభూ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను కులమతాలకతీతంగా రైతు కుటుంబాలలో ఆనందం చూడాలనే గొప్ప సంకల్పంతో రైతు సంబరాల పేరిట బండలాగుడు పోటీలు నిర్వహించడం జరుగుతున్నదని అన్నారు. దైవకార్యాన్ని అడ్డంపెట్టుకుని వ్యక్తుల మధ్యచిచ్చుపెట్టుతామంటే సహించేది లేదన్నారు. ప్రభుత్వం మాదే ఉంది కదా అని ఏకపక్షంగా ముందుకు వెళ్తే సరియైనది కాదని అన్నారు. తల్లికి గాజులు తీసుకు రాలేనోడు, పినతల్లికి బంగారు గాజులు తెస్తామన్నట్లు ఉందని కాంగ్రెస్ నాయకుల తీరును ఎద్దేవా చేశారు. గ్రామంలో ప్రథమ పౌరుడు సర్పంచు హోదాను గౌరవిస్తూ అందరం కలిసిమెలిసి గ్రామ సర్పంచు ఆధ్వర్యంలో ఇంకా ఘనంగా నిర్వహించటానికి ముందుకు రావాలని కాంగ్రెస్ నాయకులకు సూచించారు. నాయకులకు అధికారం ఉంటది. లేకుంటాది కానీ మేమే పెత్తనం చేలాయిస్తామంటే ఊరుకునేది లేదన్నారు.మాఫియాను అడ్డంపెట్టుకుని మల్దకల్‌లో దౌర్జన్యాలు చేస్తామంటే ఊరుకునే ప్రసక్తేలేదన్నారు. దళిత సర్పంచును భయాబ్రాంతులకు గురిచేస్తూ తన హోదాను అగౌరపరిచేవిధంగా కించపరిచినట్లైతే కబడ్దార్ అంటూ ఘాటూగా కాంగ్రెస్ నాయకులు ఉద్దేశించి ఖండించారు. గ్రామంలో కులమతాలకతీతంగా అన్నదమ్ములుగా మెలుగుతున్న సందర్భంలో దైవ కార్యన్ని అడ్డంపెట్టుకుని కుట్రలు కుతంత్రాలలో విడదీసేందుకు ప్రయత్నిస్తే ఊరుకోబోమని ఘాటూగా హెచ్చరించారు. దేశంలోని రెండవ తిరుపతిగా పేరుపొందిన మల్దకల్ తిమ్మప్ప స్వామి బ్రహ్మోత్సవాలను దేశానికే ఆదర్శవంతంగా నిలిచేలా శాంతి సహనంతో ఘనంగా జరుపుదామని పిలుపునిచ్చఆరు. ఈ విలేకరుల సమావేశంలో బిఆర్‌ఎస్ నాయకులు విక్రసింహ రెడ్డి, వైస్ ఎంపీపీ వీరన్న, గ్రామసర్పంచు యాకోబు, సీతారామిరెడ్డి, కొంకతి నరేందర్, మధు, ఎంపీటీసీ నర్సింహులు, తిమ్మరాజు, ఉప్పరినారాయణ, బద్రి , వార్డు సభ్యులు బిఆర్ఎస్ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో జిల్లా బిఆర్ఎస్ నాయకులు

బండలాగుడు పోటీల నిర్వహణకై కాంగ్రెస్ నాయకులు కలిసి వస్తే
స్వాగతిస్తాం నియంతలా వ్యవహరిస్తే ఎందాకైనా తెగిస్తాం..
తల్లికి గాజులు తేలేనోడు పినతల్లికి బంగారు గాజులు చేయిస్తానన్నట్లు
కాంగ్రెస్ నాయకులు వ్యవహరించడం సరియైనది కాదు
ఎన్నికలలో బహుజన వాదంతో ముందుకొచ్చిన కాంగ్రెస్ నాయకులు
మల్దకల్ గ్రామ దళిత సర్పంచు పట్ల నియంతలా వ్యవహరించడం అంటే
ఇదేనా? బహుజన వాదం పట్ల ఉండే నిబద్ధత ఇదేనా
ఆనాది నుండి కలిసిమెలిసి బండలాగుడు పోటీల సంబరాలు చేస్తున్న
సమయంలో ఏకపక్షంగా వ్యవహరిస్తే కబడ్ధార్ కాంగ్రెస్ నాయకులారా?
భిన్నత్వంలో ఏకత్వం చాటుకుంటూ లౌకికవాదాన్ని చాటుదాం
కలిసిమెలిసి ఘనంగా రైతు సంబరాలు జరుపుదాం

## వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి ..

**నేషనల్ వాటర్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ సంచాలకులు రాజ్‌కుమార్ మిశ్రా ..**

**వనపర్తి ప్రతినిధి, డిసెంబర్ 15, ప్రభాతవార్త :** డిసెంబర్ 16 నుండి జనవరి 26వరకు జిల్లాలో నిర్వహించే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నేషనల్ వాటర్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ సంచాలకులు రాజ్‌కుమార్ మిశ్రా కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్దిదారులను గుర్తించి అందించేందుకు గాను భారత ప్రధాని నరేంద్ర మోడి డిసెంబర్ 16న సాయంత్రం 4 గంటలకు ఢిల్లి నుండి వర్చువల్ ద్వారా వికసిత్ భారత సంకత్ప యాత్రను ప్రారంభోత్సవం చేయనున్నారన్నారు.ఈ యాత్ర కోసం జిల్లాకు రెండు ఐఈసి వాహనాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఒక్కో వాహనం ద్వారా రోజుకు రెండు నుండి మూడు గ్రామాలు లేదా మున్సిపాలిటి వార్డుల వారిగా పర్యటించి కేంద్ర ప్రభుత్వం 17 రకాల పథకాలను ప్రచారం చేయడం జరుగుతుందన్నారు. 255 గ్రామ పంచాయతీలతో పాటు మున్సిపల్ వార్డులలో సైతం ఈ యాత్ర నిర్వహించడం జరుగుతుందని ఇందుకు రూట్ మ్యాప్ తయారు చేయడం జరుగుతుందన్నారు. ఘణపురం మండలంలోని సోళిపూర్‌లో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలోని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సహకరించాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ తిరుపతిరావు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి అయి 2947 నాటికి వంద సంవత్సరాలు పూర్తి అవుతున్నందున అప్పటి వరకు అభివృద్ధి చెందిన దేశంగా ప్రకటించుకునే విధంగా ప్రతి ఒక్కరు అన్ని అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డైరెక్టర్ శశికుమార్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దేవరకద్రలో ఘనంగా వాసవిమాత పల్లకిసేవ..

**-అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు**

**దేవరకద్ర,డిసెంబరు 15 ప్రభాతవార్త:** దేవరకద్రలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా ఈ పూజలు నిర్వహించారు.అలాగే అమ్మవారికి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పల్లకిలో తీసుకొని దేవస్థానం చుట్టూ ప్రదిక్షణలు నిర్వహించారు. పురోహితుల వేధమంత్రాలు,భక్తులు హరినామశ్చరణల మద్య ఈ సేవ ముందుకు కదిలింది. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవిమాత అమ్మవారు భక్తులకు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక ఆర్యవైశ్యసంఘం అధ్వర్యంలో భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.



వాసవిమాత ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

**ఘనంగా కుంకుమార్చన..** దేవస్థానంలో శ్రీ చక్రాలతో అమ్మవారికి కుంకుమార్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అలితా సహస్రనామపారాయణం కార్యక్రమాన్ని కూడ నిర్వహించారు. పంచామతాలతో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజ నిర్వహించారు.మ హామంగళ హారతి,ప్రసాదవితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ అధ్యక్షుడు కల్వకన్నయ్యశెట్టి, మహిళాసంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజులరాణి, జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు గుద్దేటి చంద్రయ్యలతో పాటు స్థానిక ఆర్యవైశ్యులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతో దోమల నివారణ:లట్టుపల్లి వైద్యాధికారి

**బిజినేపల్లి,డిసెంబరు 15 ప్రభాతవార్త :** ఇంటి పరిసరాలలో దోమలు పెరకుండా పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమల నివారణ సాధ్యమవుతుందని లట్టుపల్లి వైద్యాధికారి డా.బి.శ్రీకాంత్ అన్నారు. మంగనూరు గ్రామంలో శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యారోగ్యశాఖ ఆదేశానుసారం ప్రతి శుక్రవారం ఆశా కార్యకర్తలు తమ పరిధిలో ఇంటింటా పొడిదినం కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, ఆరోగ్య అవగాహన కల్పించాలని సూచించారు. దోమ కాటుతో వచ్చే వ్యాధులు డెంగ్యూ, చికెన్‌గున్యా, మలేరియా, బోదకాలు, మెదడువాపు వ్యాధుల నివారణకు, దోమకాటు కాకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఇంట్లో, ఇంటిచుట్టూ పనికిరాని కూలర్లు, పాత టైర్లు, డ్రమ్ములు, వాడని రోళ్లు, కొబ్బరి చిప్పలు, పగిలిన కుండలు, సీసాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉన్న గుంతలలో క్రిమిసంహారక మందులు, కిరోసిన్ లేదా వాడిన ఇంజనాయిల్లో ముంచిన గుడ్డ ఉండలలా వేయాలి. దీంతో దోమల లార్వాలు చనిపోతాయని వివరించారు. నీటితో నిల్వ ఉంచే పాత్రలను తప్పనిసరిగా హౌసులు, సంపులు, ట్యాంకులు, బిందెలు, గిన్నెలు, పూలతొట్టిలు, ప్రతి శుక్రవారం రోజు పొడిగా కొద్దిసేపు ఉంచి, శుభ్రపరిచి తదుపరి వాడుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు టి.యాదగిరి, పి.జ్యోతి, ఆశా కార్యకర్తలు శారద, బాలమణి, నాగమ్మ, పద్మ, అనితలు పాల్గొన్నారు.



దోమల నివారణకు మందులు చల్లుతున్న ఆరోగ్య సిబ్బంది

## ఘనంగా మినీ క్రిస్మస్ వేడుకలు..

**పాస్టర్లకు బట్టలు పంపిణీ చేసిన కో ఆప్షన్ దంపతులు**

**కొత్తకోట,డిసెంబర్ 15,ప్రభాతవార్త :** కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో నిసాయిరాం ఫంక్షన్‌హాల్లో కొత్తకోట రీజియన్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్యాతితులుగా సిద్దిపేట నుండి బ్రదర్ ప్రకాష్ పాల్గొని దైవ సందేశం అందించారు.ముందుగా అథితులుగా వచ్చిన వారికి శాలువతో పాస్టర్లు ఘనంగా సన్మానించారు.అనంతరం కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.కొత్తకోట మండల పరిధిలో పని చేస్తున్న దైవ సేవకులకు మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు కాంగ్రెస్ నాయకులు జేఎమ్ మిషేక్ ప్రేమలత దంపతులు 25 మంది సేవకులకు బట్టలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడుతనాన్ని విడిచి పెట్టి సన్మార్గంలో నడవాలని మంచి మార్గాన్ని చూపుతూ ఎలాంటి కల్మషం లేని దైవ సేవకులకు నా శక్తి కొలది సాయం చేయడం చాలా ఆనందంగా ఉందని అన్నారు.యేసుక్రీస్తు మనకు భూలోకంలో ప్రేమ,శాంతి సమాధానం,నెమ్మది,ఆదరణ ఎలాగూ చూపాడో మనం కూడా వాటిని ఎదుటి వ్యక్తి పట్ల చూపాలని తెలిపారు.ముందుగా క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు జడ్పీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్,సీడీసీ చైర్మన్ చెన్నకేషవ రెడ్డి,మాజీ జడ్పీటీసీ విశ్వేశ్వర్,మాజీ ఉప సర్పంచ్ బోయాజ్,కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి,కౌ న్సిలర్ పద్మ అయ్యన్న,మెస్త్రి శ్రీను,గొల్లబాబు,కృష్ణ రెడ్డి,బాలనారాయణ,సుభాష్,మునగారి కృష్ణ,పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశే ఖర్,ఉపాధ్యక్షుడు శాస్ర్తీ,ప్రధానకార్యదర్శి పాల్,కార్యదర్శి విజయ్,సభ్యులు విలియమ్స్ ,పురుషోత్తం,పాల్,హన్మంత్,చంద్రబాబు,వేణు పాల్గొన్నారు.



పాస్టర్లకు బట్టలు పంపిణీ చేస్తున్న మిషేక్ దంపతులు

## మున్సిపల్ కార్మికులు అంకితభావంతో పని చేయాలి:ఎస్బిఐ బ్యాంక్ మేనేజర్

**కొత్తకోట,డిసెంబర్ 15,ప్రభాతవార్త :** మున్సిపల్ కార్మికులు అంకితభావంతో పని చేయాలని ఎస్బిఐ మేనేజర్ లక్ష్మీకాంత్ అన్నారు.శుక్ర వారం కొత్తకోట మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులకు కో ఆప్షన్ సభ్యులు మిషేక్ తో పాటు దాతల సహకారంతో కార్మికులకు క్రిస్మస్ ప్రేమ విందును ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యాతితులు ఎస్బిఐ మేనేజర్ లక్ష్మీకాంత్, మున్సిపల్ కో ఆప్షన్ మిషేక్,కృష్ణయ్యలు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల వల్లే కొత్తకోట సుందరంగా ఉందని అన్నారు.ఏ పనైనా నాది అనుకోని చేసినప్పుడే అన్ని బాగుంటాయని తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్బిఐ మేనేజర్

## దేవరకద్రలో అన్నదానం



**దేవరకద్ర,డిసెంబరు 15 ప్రభాతవార్త:** దేవరకద్రలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.పట్టణానికి చెందిన అశోక్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.అలాగే స్వీట్లు పంచి పెట్టారు.ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి వేడుకలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నాయకులు దేవరకద్ర డాన్ బండ హన్మిరెడ్డి,కృష్ణారెడ్డి,నాగిరెడ్డి,నారాయణరెడ్డి,చక్రపాణి,హన్మంత్‌రెడ్డి,పాష,మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## కోయిల్‌సాగర్‌లో 31.8 ఫీట్లకు తగ్గిన నీటిమట్టం



**దేవరకద్ర,డిసెంబరు15ప్రభాతవార్త:**జిల్లాలోని భారీనీటి పారుదల కోయిల్‌సాగర్‌లో నీటిమట్టం తగ్గుముఖం పట్టింది.తీలేర్ పంప్ హౌజ్‌ద్వారా కృష్ణజలాలను కోయిల్‌సాగర్‌కు తరలించడం ఆపేశారు.దీంతో ప్రాజెక్టులో శుక్రవారం సాయంత్రం నాటికి ప్రాజెక్టులో నీటిమట్టం 31.8ఫీట్లకు తగ్గింది. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ స్థోమత 32.5 ఫీట్లు. ప్రాజెక్టులోకి కొత్త నీరు వచ్చి చేరుతుండటంలో కోయిల్‌సాగర్‌కు జలకళ వస్తుంది.ప్రాజెక్టును చూడటానికి వచ్చే పర్యాటకుల సంఖ్య కూడ క్రమేపి పెరుతుంది.

## 17న దేవరకద్రలో బిజేపి సమీక్ష సమావేశం..

**దేవరకద్ర,డిసెంబరు 15 ప్రభాతవార్త:** దేవరకద్రలో ఈ నెల 17న బీజేపి సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ దేవరకద్ర నియోజకవర్గ నాయకుడు కొండ ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం విలేకరులకు తెలిపారు.రాయచూర్ రోడ్డులోని స్థానిక బిజేపి రాష్ట్ర నాయకుడు డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి స్వగృహంలో ఆ రోజు ఉదయం 10లకు ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కావున పార్టీ బూత్ కమిటీ ఇంచార్జిలు,శక్తికేంద్రం ఇంచార్జిలు,ముఖ్యనాయకులు తప్పక ఈ సమావేశానికి హాజరకావాలని కొండ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

## డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేత

**నవాబ్‌పేట, డిసెంబరు 15 ప్రభాతవార్త :** కూచుర్, ఇప్పటూర్ బస్‌ని తిరిగి ప్రారంభించాలని మ హబూబ్‌నగర్ డిపో మేనేజర్‌కు ఇప్పటూర్ సర్పంచ్ రవి కిరణ్ వినతి పత్రం అందజేశారు. బస్సు రాక పోవడం వలన విద్యార్థులు,మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎ దుర్కొంటున్నారని మే నేజర్‌కు వివరించారు. త్వరలో బస్‌ని పునరుద్ధరించాలని డిపో మేనేజర్‌ను కోరారు.



## ప్రవేశ పరీక్షకు దరఖాస్తులకు ఆహ్వానం

**వనపర్తి ప్రతినిధి, డిసెంబర్ 15, ప్రభాతవార్త :** విజయనగరం జిల్లా కోరుకుండ సైనిక్ పాఠశాలలో ప్రవేశం పొందాలనుకునే 6,9వ తరగతి విద్యార్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. 2024న25 విద్యా సంవత్సరంలో 6వ తరగతి, 9వ తరగతిలో ప్రవేశానికి గాను జనవరి21, 2024 నాడు ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని ,ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 16వ తేది లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## హాకీ క్రీడలో రాష్ట్రస్థాయికి ఎంపిక..

**కొత్తకోట,డిసెంబర్ 15,ప్రభాతవార్త :** కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో ఉన్న సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదు వుతున్న శాలిని,అమృత అనే ఇద్దరు అయ్యాయిలు రాష్ట్రస్థాయిలో నిర్వహించే హాకీ పోటీలకు ఎంపిక అయినట్లు పిఈటీలు రాజేశ్వరి, భారతిలు తెలిపారు.ఈ నెల 12న జిల్లా కేంద్రంలో ఉమ్మడిజిల్లా స్థాయిలో జరిగిన సెలక్షన్స్‌లో పాఠశాల ఇద్దరు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాలతి విద్యార్థినిలను అభినందించారు.రాష్ట్ర స్థాయిలో కూడా హాకీలో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.



## అంగన్వాడి కేంద్రాలలో గర్భిణీలకు షోషక ఆహారం సక్రమంగా అందించాలి



చిన్నారుల విద్యా బోధన సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో కథలప్ప

**వీపనగండ్ల, డిసెంబర్ 15, ప్రభాతవార్త:** వీపనగండ్ల మండలం కేంద్ర పరిధి లోని బొల్లారం గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి కథలప్ప సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల నుండి గర్భాణీ స్త్రీలకు, చిన్న పిల్లల తల్లులకు, చిన్నారులకు అందుతున్న పోషక ఆహారం గురించి తెలుసుకొని సక్రమంగా అందించాలని అంగన్వాడి ఉపాధ్యాయులకు తెలియజేశారు. అదే విధంగా చిన్నపిల్లలకు అంగన్వాడి కేంద్రాలలో ఆటపాటలతో కూడిన విద్యా భ్యాసాన్ని ఏ విధంగా బోధిస్తున్నారు అనే విషయాన్ని పరిశీలించి తగిన సలహా సూచనలు చేశారు. విద్యార్థులకు విద్యాభ్యాసం ఆటపాటలతో బోధిం చాలని అప్పుడే చిన్నారులకు సరైన విద్యా అందించగలరని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఉపాధ్యాయురాలు తిరుపతమ్మ, తది తరులు పాల్గొన్నారు.

## విత్తనాలను సరైన క్రమంలో నాటండి : ఎంపీడీవో

**వీపనగండ్ల, డిసెంబర్15, ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కేంద్ర పరిధిలోని బొల్లారం గ్రామంలో మొక్కల పెంపక నర్సరీని ఎంపీడీవో కథలప్ప పరిశీ లించారు. ఈ సందర్భంగా నర్సరీ సిబ్బందికి విత్తనాలను సరైన క్రమ పద్ధతిలో నాటాలని, ఉదయం సాయం త్రం రెండుసార్లు క్రమం తప్పకుండా విత్తనాలకు నీరు పట్టాలని అప్పుడే మొక్కలు పెరుగుతాయని తెలియజేశారు. నర్సరీలో పెంచే మొక్కల విషయంలో నిర్లక్ష్యం చేయొద్దని సిబ్బందికి తెలి యజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



## రెడీమేడ్ క్లాత్‌స్టోర్‌ను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే ఆల



జహంగీర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల

**అడ్డాకుల, డిసెంబరు 15 ప్రభాతవార్త:** అడ్డాకుల మండల కేంద్రంలో జిపి కలెక్షన్ రెడీమేడ్ క్లాత్ స్టోర్‌ను సందర్శించి జహంగీర్ గోరికి మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మండల కో ఆప్షన్ సభ్యులు ఖాజాగోరి తండ్రి బషీర్‌గోరి అనారోగ్యంతో బాధపడతున్న ఆయన ను పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఆయన ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్య క్షులు టి.శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ జితెందర్‌రెడ్డి, ఎంపిటిసి రంగన్న గౌడ్, నాయకులు దేవేందర్‌రెడ్డి, బొడ్డు రమేష్, లక్ష్మయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పడమటి అంజన్న హుండీ లెక్కింపు

**మక్తల్, డిసెంబరు15 ప్రభాతవార్త:** మక్తల్ పడమటి ఆంజనేయస్వామి హుండీని స్వామి ఆవరణలో ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, వంశ పారం పర్య ధర్మకర్త భీమాచారి, ఇఒ శ్యామసుందచారి ఆధ్వర్యంలో శుక్రవారం లెక్కింపు చేయగా, 3 లక్షల 68 వేల 770 రూపాయలు వచ్చాయి. పడమటి అంజ న్న జాతర ఉత్సవాలకు ముందు హుండీ లెక్కించడం ఆనవాయితీ. జులై 28వ తేదీ డిసెంబర్ శుక్రవారం నాలుగు నెలల తర్వాత లెక్కించడం జరి గింది. ఈ లెక్కింపు కార్యక్రమంలో ప్రధాన పూజారి ప్రాణేష్‌చారి, అరవింద వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ఆంజనేయస్వామి భక్తబృందం పాల్గొన్నారు.



## ఘనంగా సెమి క్రిస్మస్ వేడుకలు

**చిన్నచింతకుంట, డిసెంబరు15 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ఎంబి సీయోను చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు, ఎంబి కాన్ఫరెన్స్ పాస్టర్స్ సదస్సును ఘనంగా నిర్వహించారు. ఎంబి బోర్డు ఆఫ్ ఎడ్యు కేషన్ అధ్యక్షులు జి.యోన అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంబి కాన్ఫరెన్స్ జి.సి ప్రిసిడెంట్ రెవ.డా. ఐపి ఆశీ ర్వాదం పాల్గొని ప్రసంగించారు. క్రీస్తు జన్మదిన విశిష్టతను గురించి తెలిపారు. భారతదేశంలో ఎంబి కాన్ఫరెన్స్ స్థాపించిన ఉద్దేశాన్ని ఎంబి కాన్ఫరెన్స్ ద్వారా ఈ దేశంలో విద్య, వైద్యపరంగా చేసిన సేవను కొని యాడారు. మిషనరీల కృషివల్ల నేడు భారతదేశంలో 1000కి పైగా చర్చిలు ఉన్నాయని, మళ్లీ ఎంబి కాన్ఫరెన్స్‌కు పూర్వ వైభవం కొరకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిసి వైస్ ప్రెసిడెంట్ రెవ.పి.మెన్నిజోయెల్, అయన్న, రెవ ఎస్ఎస్ దేవిడ్, సెక్రెటరీ రెవ.జికె రుపాస్, ట్రెజర్ ఎ. టైటస్ రాజేందర్, రెవ. ఎ.శ్యామ్‌రావు, విజయభూషణం, ఎంబిడిఓ సెక్రెటరీ ఎస్.శేఖర్, పీస్ కమిటి అధ్యక్షుడు రెవ.ఎఎస్ గిద్దియోన్, స్థానిక ఎంబి సీయోను, చర్చి ఛైర్మన్ రెవ.జి. మోషే, సి.ప్రకాశం, సుదర్శన్, జి.పిలోగు, యావత్ దేశంలో ని వివిధ రాష్ట్రాల నుండి ప్రతినిధులు, ఉమ్మడి జిల్లా క్రైస్తవులు, స్థానిక ఎంబి సియోను చర్చ్ కౌన్సిల్ విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.



సెమి క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

## బంజారా భవన్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్

**నారాయణపేట ప్రతినిధి, డిసెంబరు15 ప్రభాతవార్త:** జిల్లా కలెక్టర్ కార్యాల యంలో అదనపు కలెక్టర్ చాంబర్‌లో గిరిజన సంక్షేమ అభివృద్ధి శాఖ అధి కారులతో అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్ శుక్రవారం భవన నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాటా ్లడుతూ బంజారా భవన్ పనులు ఎంత మేరకు జరుగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. దానికి సంబంధించి మద్దూరు, కోస్గి రోడ్డు పనులు త్వరగాపూర్తి చేయాలనిఅన్నారు. టెండర్ అగ్రిమెంట్ పనులుఉంటే త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.




అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

## విద్యార్థులకు గణితంపై మండల స్థాయి ప్రతిభా పరీక్ష

**లింగాల, డిసెంబరు 15 ప్రభాతవార్త:** డిసెంబర్ 22న గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థులకు మండలస్థాయి గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేఖర్ తెలిపారు. ఈ గణిత శాస్త్ర ప్రతిభ పరీక్షలో తెలుగు మీడియంలో వై. మహేష్ జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాల అంబటపల్లి, కావ్య కస్తూర్బా గంధి విద్యాల యం లింగాల, శిరీష కస్తూర్బా గాంధీ విద్యాలయం లింగాల, శిరీష కస్తూర్బా గాంధి విద్యాలయం గద్వాల, లింగాల పాఠశాలలకు చెందిన విద్యార్థులు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను గెలుపొందారు. అదే విధంగా ఇంగ్లీష్ మీడియంలో పి. నరసింహ్మాస్వామి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లింగాల, ఆర్. నిచత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లింగాల, యు. నవ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లింగాల, వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను గెలుపొందారు. తెలుగు, ఇంగ్లీష్ మీడియం లో గెలుపొందిన విద్యార్థులు ఈనెల 20వ తేదీన జిల్లాస్థాయిలో జరిగే పోటీ పరీక్షలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యా యులు శంరయ్య, విష్ణు, అచ్చాలి, అలివేలు, పాఠశాలఉపాధ్యాయులు అర వింద్, వెంకట్రాజు, శ్రీను, పురుషోత్తం, సుందరయ్య, జంగయ్య, పరశు రాములు, సునితమ్మ, నిరంజన్, రవికుమార్, అశ్రఫ్, అహ్మద్‌హుస్సేన్, అబ్దుల్లా, ఫర్హానాబేగం, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.



తెలంగాణ గణితఫోరం ఆధ్వర్యంలో పోటీ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

## జమ్ములమ్మ ఆలయం పున: నిర్మాణం

**మక్తల్, డిసెంబరు 15 ప్రభాతవార్త:** మక్తల్‌లో వెలసిన అతి పురాత నమైన జములమ్మ దేవాలయం పున: నిర్మాణం మనసాని నరసిం హయ్య, రత్నమ్మ జ్ఞాపకార్థంతో వారి కుమారుడు మనసాని వెంకటే ష్ సరళదేవి 2 ఫిబ్ర వరి 2024 నాడు జమ్ములమ్మ విగ్రహ ప్రతిష్టా పన మహోత్సవం ఉంటుందని దీని కిగాను నూతన ఆలయ నిర్మాణం పూర్తి చేశామని ఆయన తెలిపారు. జమ్ములమ్మ ఆలయానికి మక్తల్ పరి సర గ్రామాల ప్రజలు దర్శించుకుంటారని, పురాతన ఆలయం చిన్నగా ఉన్నందున, భక్తుల సౌకర్యం కొరకు ఈ నూతన ఆలయాన్ని నిర్మించాలని అనుకుని మనసాని వెంకటేష్ తెలిపారు అలాగే ఆయన దైవభక్తి, దేవాల యలకు కానీ, సమాజ సేవ కార్యక్రమాలలో తనవంతు పూర్తి సహాయ సహకారాలన్ని ప్రజలకు అందిస్తారు. పట్టణంలో ఎన్నో సేవా కార్యక్రమాలు బీద విద్యార్థులకు చదువు కొరకు, అనాథ పిల్లలకు ఆర్థిక సహాయం, ముసలి వారికి దుప్పట్లు ఇలాగే అనేక సేవా కార్యక్రమాలలో పాలు పంచు కుంటారు. తన చిన్నత నంలో వారి తండ్రి నర్సింహయ్య చెప్పిన స్ఫూర్తి తో ఈ సేవా కార్యక్ర మాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యు లు, మనసాని కిరణ్, ప్రత్యూష, మనసాని శ్రావణ్ కుమార్, ప్రత్యూష పాల్గొన్నారు.



మనసాని వెంకటేష్ సరళ దంపతులు



పున: నిర్మిస్తున్న జమ్ములమ్మ ఆలయం

## పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు

**కృష్ణ, డిసెంబరు 15 ప్రభాతవార్త:** కృష్ణ మండలంలోని తంగేడి గ్రామ శివారులో కొంతమంది డబ్బులు పందెం పెట్టుకుని పేకాట ఆడుతుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి ఆరుగురు వ్యక్తుల వద్దనుండి రూ. 16,380, 4సెల్‌ఫోన్లు, 5బైక్‌లు పట్టుకొని పోలీస్ స్టేషన్‌లో అప్పగిం చడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణ ఎస్సై విజయ భాస్కం లు మాట్లాడుతూ జూదమాడుతున్న ఆరుగురు వ్యక్తులపై గేమింగ్ ఆర్ట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందని తెలిపారు.



జూదమాడుతున్న వ్యక్తులను అరెస్టు చేసిన పోలీసులు

## చిత్రకారున్ని అభినందించిన కలెక్టర్



చిత్రకారుడుని అభినందిస్తున్న నాగర్‌కర్నూల్ కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 15 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ ఉదయ్‌కుమార్‌కు పెన్సిల్‌తో గీసిన చిత్రపటాన్ని అచ్చంపేట వాసి ప్రముఖ చిత్రకారుడు గిద్దె కృష్ణ శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కలిసి పెన్సిల్‌తో గీసిన ఆయన చాయ చిత్రాన్ని బహుకరించారు. అనంతరం కలెక్టర్ కృష్ణ గురించి వివరాలడుగుతూ అభినందించారు. ఆయన చిత్రాన్ని చూసి చాలా సంబురపడి సంతోషం వ్యక్తం చేశారు. కలెక్టర్ ఆఫీసులో అవసరమైన చోట్ల పలు పెయింటిం గ్‌లు ఎక్కడ అవసరముంటే అక్కడ వేయాలని అధికారులకు సూచిం చారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు డీఈఓ గోవిందరాజులు, జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి, అకాడమిక్ అధికారి షర్ఫుద్దిన్, చిత్రకారులు శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

## ఎస్సీ వర్గీకరణను వెంటనే చేపట్టాలి

-మాదిగ జేఏసీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు పోలే రాజు

**కల్వకుర్తి, డిసెంబర్ 15 ప్రభాతవార్త:** బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వర్గీకరణ చేస్తా మని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 10 సంవ త్సరాలు దాటిన వర్గీకరణ చేపట్టలేదని మాదిగ జేఏసీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు పోలే రాజు మాదిగ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్ర వారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మాది గలకు ఎన్నికలు వచ్చినప్పుడు అధికారంలోకి రావడానికి హామీలు మాత్రమే ఇచ్చి ఆచరణలోకి తేవడం లేదన్నారు. బీజేపీ నేతలు అవలంభిస్తున్న మాదిగ వ్యతిరేక విధానాలను ఎండగ డుతూ డాక్టర్ పిడమర్తి రవి నేతృత్వంలో పెద్ద ఎత్తున నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. జరగబోయే పార్ల మెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించాలని మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో ఢిల్లీ జంతర్‌మంతర్‌లో ధర్నా నిర్వహించడం జరు గుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 18,19 దేశ రాజధాని ఢిల్లీలో మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో జరిగి నిరసన కార్యక్రమాలు విజయవంతం చేయాలనిరాజు కోరారు. చలోఢిల్లీ కార్యక్రమం పెద్ద ఎత్తున విజయవం తంచేసేందుకు మాదిగ భారీగా తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు.



## వనపర్తి అదనపు కలెక్టర్‌గా సంచిత్ గంగ్వార్

**వనపర్తి ప్రతినిధి, డిసెంబర్15, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం జరిగినబదిలీల్లో భాగంగా. వనపర్తి అదనపు కలెక్టర్‌గా సంచిత్ గంగ్వార్. నియామకం అయ్యినట్లు రాష్ట్ర ఉన్నతాధికారులు ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

## 18న పడిపూజ..!



పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్వాములు

మొదటి పేజీ తరువాయి భాగం..

బ్రహ్మశ్రీ సుధీర్ నంబూద్రిస్వామి చేతుల మీదుగా 18వ తేదీన సోమ వారం నిర్వహించే అయ్యప్ప పడిపూజ కార్యక్రమాలు ఉదయం 8 గం.ల నుండి 10.30 వరకు వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం మొద లుకొని వేపూరి గేరిలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వరకు భక్తుల తో ఊరేగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం సాయంకాలం పాలకొండలో ఉన్న వాసవి గార్డెన్ హాలులో సాయంత్రం ఐదు గంటల 30 ని.లకు భగవతి సేవ ఏడు గంటలకు అయ్యప్ప అభిషేకం, 8 గం.లకు అయ్యప్ప స్వామి పడిపూజ, 9.30 గం.లకు అయ్యప్పస్వామి వారి హరివరసనం కార్యక్రమంతో ముగింపు ఉంటుందన్నారు. ఈ పడి పూజ మహోత్సవానికి భక్తులందరు విశేషంగా హాజరై తరలివచ్చి అయ్యప్ప కృపకుపాత్రులు కావాలని కోరారు. ఈ సమావేశంలో అయ్యప్ప సేవా సమాజం సెక్రెటరీ ముత్యం, అచల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడు సీమ నరెందర్, ఆర్యవైశ్య అధ్యక్షుడు గుండా వెంకటేష్, ఎదిర ప్రమోద్, సంకురాము, శివకుమార్, శ్రీహరి, మహేష్, రాము, స్వాములు పాల్గొన్నారు.

## అధికారులు ఇకపై ఉదయమే క్షేత్రస్థాయిలో ఉండాలి

- పారిశుద్ధ్యం, గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలి
- మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ జి. రవినాయక్ ఆదేశం

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు15 ప్రభాతవార్త:** ఎంపిడి ఓలు, ఎంపిఒలు, ఎపిఒలు, గ్రామపంచాయతీ కార్యదర్శుల తో సహ ఇకపై ఉదయమే క్షేత్రస్థాయిలో గ్రామాలలో ఉండాలని జిల్లా కలెక్టర్ జి. రవినాయక్ అన్నారు. శుక్రవారం ఆయన సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి కార్యక్ర మాలపై ఎంపిడిఓలు, ఎంపిఓలు, ఎపిఓ లతో సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం, శానిటేషన్ వంటి కార్యక్రమాలను నిరంతరం కొనసా గించాలని, వీటిపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలన్నారు. ప్రత్యేకించి ఉపాధి హామీ పథకం కింద కూలీల శాతాన్ని పెంచాలని, ఎక్కువ మందికి పని కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని, సమయానికి చెల్లింపులు చేయాలని, అదేవిధంగా మస్టర్ విష యంలో చురుకుగా ఉండాలని తెలిపారు. గ్రామ పంచాయ తీలకు సంబంధించి ఆస్తుల వివ రాలను, భవనాల వివరాల ను 10 శాతం లే అవుట్లతో సహా పూర్తి వివరాలను సేకరించి సమర్పించాలని ఆదేశించారు. గ్రామా లలో విద్యుత్ బిల్లులు అనవసరంగా పెరిగిపోకుండా అవసరం ఉన్నంత మేరకే మోటార్లు వినియోగించేలా చూడాలని, ప్రభు త్వం నిర్దేశించిన ప్రకారం విద్యుత్ బిల్లులు చెల్లించాలని ఆదేశించారు. ఇంటి పన్ను వసూళ్లపై దృష్టి సారించి నూటికి నూరుశాతం పన్ను వసూలు చేయాలని, జిల్లాలో కేవలం 40 శాతం మాత్రమే ఇంటి పన్ను వసూలు ఉందని దీనిని పెంచాలని ఆదేశించారు. గ్రామాలలో క్రీడా ప్రాంగణాలన్నింటిని సద్వినియోగంలో ఉండేలా చూడాలని, అదేవిధంగా ఇదివరకే పంపిణీ చేసిన స్పోర్ట్స్ కిట్లను సద్విని యోగమయ్యేలా చూడాలని ఆదేశించారు. మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా బ్యాగులలో విత్త నాలు వేయటం వంటివాటిని చేపట్టాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద నాటే ఉద్యాన మొక్కలపై దృష్టి సారించి త్వరితగతిన నిర్దేశిం చిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఆయా గ్రామాలకువచ్చే ప్రచార వాహనాలకు సంబ ంధించి షెడ్యూల్ తయారు చేసి గ్రామస్థాయిలోని అధికారులందరు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకొని ఈ కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. స్థానిక సంస్థల ఇంఛార్జి అదనపు కలెక్టర్, డిఆర్‌డిఓ యాదయ్య, డిపిఓ వెంకటే శ్వర్లు, జడ్పీ సీఈఓ జ్యోతి, డిఎఫ్ఓ సత్యనారాయణ, హార్టికల్చర్ ఏడి సాయిబాబా తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జి.రవినాయక్



హాజరైన అధికారులు

## 16 నుంచి వికసిత్ భారత్ సంకల్పయాత్ర

- లబ్ధిదారుల గుర్తింపు, అవగాహన కోసమే
- కేంద్ర రక్షణశాఖ జాయింట్ సెక్రెటరీ వేద్‌వీర్ ఆర్య

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు15 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ ప్రాధామ్య పథకా లను అర్హులైన లబ్ధిదారుల చెంతకు తీసుకువెళ్లడమే కాకుండా, కొత్త లబ్ధదారుల చెంతకు తీసుకువెళ్ళడమే కాకుండా, కొత్త లబ్ధిదారుల గుర్తింపులో భాగంగా అవగాహన నిమిత్తం ఈనెల 16 నుండి జనవరి 26 వరకు జిల్లా వ్యాప్తంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర అనే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కేంద్ర రక్షణశాఖ జాయింట్ సెక్రెటరీ వేద్ వీర్ ఆర్య తెలిపారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహణ విషయమై శుక్రవారం ఆయన సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని రెవెన్యూ అదనపు కలెక్టర్ చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలకు మౌలిక సదుపాయాలైన పారిశుద్ధ్యం, ఆర్థిక సహాయం, ఎల్పీజి కనెక్షన్లు, ఇండ్లు, ఆహార భద్రత, పౌష్టికాహారం, వైద్యం, విద్య, స్వచ్ఛమైన తాగునీరు, నాణ్యమైన విద్యఅందించడంలో భాగంగా అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నదని ఇందులో భాగం గా నిర్దేశించిన, అర్హత ఉన్న లబ్ధిదారులకు ఈ కార్యక్రమాలన్ని చేరేలా అలాగే కొత్త లబ్ధిదా రులను గుర్తించి వారికి అవగాహన కల్పించేందుకుగాను ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ ప్రచార కార్యక్రమంలో భాగంగా నవం బర్ 15 నుండి జనవరి 26 వరకు కార్యక్రమాన్ని నిర్వహించడ ం జరుగుతున్నదని, అయి తే శాసనసభ ఎన్నికలు ఉన్న రాష్ట్రాలలో మాత్రం డిసెంబర్ 16 నుండి జనవరి 26 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాకు 6 ప్రచార వాహనాలను కేటాయించడం జరిగిందని, ఈ వాహనాలు ప్రతిరోజు ఒక మండలంలోని 2 గ్రామాలను కవర్ చేసే విధంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. గ్రామంలో కేంద్ర ప్రభుత్వ ప్రాధామ్య పథకాలైన ఆయుష్మాన్ భారత్, పిఎం గరీబ్ కళ్యాణ్ అన్నయోజన, దీన్ దయాల్ అంత్యోదయ అన్నయోజన, దీన్ దయాల్ అంత్యోదయ అన్న యోజన, పిఎం ఆవాస్ యోజన, పిం ఉజ్వల్ యోజన, పిఎం విశ్వ కర్మ, పిఎం కిసాన్ సమ్మాన్, కిసాన్ క్రెడిట్, పోషణ అభియాన్, హార్ ఘర్ జల్ జీవన్ మిషన్, జన్‌ధన్ యోజన, స్వామిత్వ, అటల్ పెన్షన్ యోజన, పీఎం ప్రణాం, నానో ఫర్టిలైజర్ తదితర పథకాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తారని, అంతేకాక కొత్త లబ్ధిదా రులను గుర్తించే కార్యక్రమాన్ని చేపడతారని తెలిపారు. వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్య క్రమాన్ని విజయవంతం చేయడంలోభాగంగా జిల్లాకు నోడల్ అధికారిని ఎంపిక చేయడంతో పాటు, మండలాల వారిగా నోడల్ అధికారుల కేటాయింపు ఉంటుందని అన్నా రు. ఈనెల 16న సాయంత్రం 4 గం.లకు బాలానగర్ మండలం పెద్దాయిపల్లి గ్రామంలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి డా. మహేంద్రనాథ్ పాండే ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో భాగంగా పంచాయతీరాజ్, వ్యవసాయ, వైద్య, విద్య, ఆరోగ్య, పెట్రోలియం, యువజన సర్వీసులు, మహిళా శిశు సంక్షేమ, సహకార, గ్రామీణ అభివృద్ధి, గిరిజన సంక్షేమ, తాగునీటి, పారిశుద్ధ్యం, ఆయుష్ గృహ నిర్మాణ తదితర శాఖల అధికారులు అందరు పాల్గొనాలని ఆయన కోరారు. రెవెన్యూ అద నపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు, స్థానిక సంస్థల ఇంఛార్జి అదనపు కలెక్టర్, డిఆర్‌డిఓ యాదయ్య, సంబంధిత జిల్లా అధికారులతో పాటు, జిల్లా నోడల్ అధికారి, ఎల్డీఎం భాస్కర్, ఈఈ సమావేశానికి హాజరయ్యారు.



హాజరైన అధికారులు



మాట్లాడుతున్న కేంద్ర రక్షణ శాఖ జాయింట్ సెక్రెటరీ వేద్‌వీర్‌ఆర్య

### ఆరోగ్యశాఖమంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు సి.కె.మూర్తి

గోషామహల్, డిసెంబర్ 15ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రిగా పదవి భాద్యతలు చేపట్టిన దామోదర్ రాజా నర్సింహ్మాను గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు సి.కె.మూర్తి మర్యాద పూర్వకంగా కలిసి బొకె అందచేశారు.

## ఫుట్‌బాల్ గ్రౌండ్ పౌరులకు అందుబాటులోకి తెస్తాం

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

అల్వాల్, డిసెంబరు 15 ప్రభాతవార్త: ఓల్డ్ అల్వాల్ ఫుట్‌బాల్ గ్రౌండ్‌ను ప్రజలకు అందుబాటులోకి తెస్తామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వానికి చెందిన గ్రౌండ్ ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంపై లోక్‌సత్తా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ వర్మ నేతృత్వంలో పలువురు ఎమ్మెల్యేను కలవడం జరిగింది. గ్రౌండ్ విషయమై ఎమ్మెల్యే జోనల్ కమీషనర్‌తో చర్చించారు. తక్షణం గ్రౌండ్‌ను పౌరులు అవసరాలకు అనుగుణంగా స్వాధీన పరుచుకోవాలని కోరారు. ప్రభుత్వానికి చెందిన గ్రౌండ్‌లోకి ప్రజలను రానీయకుండా ప్రైవేటు వ్యక్తలు అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. గతంలో జరిగిన పరిణామాలకు సంబంధించి నివేదిక ఇవ్వాలని ఆయన కోరారు. ఫుట్‌బాల్ గ్రౌండ్ సమస్యకు సంబంధించి అధికార యంత్రాంగం చర్యలు తీసుకోకుంటే స్థానికులుతో కలిసి ఆందోళనకు దిగుతామని శ్రీనివాస్ వర్మ స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో ప్రవీణ్, రవీందర్, రాములు, నవీన్, నరసింహా, మురళి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



రెజిమెంటల్ బజార్‌లో సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ కొంతం దీపిక, బిజెపి నేత శ్రీగణేష్ తదితరులు

అడ్డగుట్ట, డిసెంబర్ 15 ప్రభాతవార్త: క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని కంటోన్మెంట్ నియోజకవర్గం మోండా డివిజన్‌లోని రెజిమెంటల్ బజార్‌లో శుక్రవారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో కంటోన్మెంట్ బిజెపి ఇన్‌ఛార్జి ఎన్.శ్రీగణేష్, మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపికలు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు వీరవర్ధన్ గౌడ్, మహిళా నాయకురాళ్ల మహాలక్ష్మీ, మాలతి పాల్గొన్నారు.

## జహంగీర్ పీర్ల దర్గాను దర్శించుకున్న జంపనప్రతాప్



కంటోన్మెంట్, డిసెంబర్ 15 ప్రభాతవార్త: కులమతాలకు అతీతంగా జహంగీర్ పీర్ల పీర్ల దర్గాను దర్శించుకోవాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపనప్రతాప్ తెలిపారు. శుక్రవారం జంహిగీర్ పీర్ల దర్గాను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా జంపన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం దర్గాను దర్శించుకోవడం అణవాయితీగా జరుగుతుందన్నారు. మంచి జరుగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి విఆర్ ఆసుపత్రి ఎండి నంద కిషోర్, నాయకులు విశ్వనాథ్, ప్రభాకర్, దాస్ తదితరులు పాల్గొన్నారు.

## క్రిస్మస్ వేడుకల్లో మాగంటి గోపినాథ్



ఫిల్మ్‌నగర్, డిసెంబర్ 15, ప్రభాతవార్త : న్యూ గ్రేస్ మినిస్ట్రీస్‌వారు నిర్వహించిన గ్రాండ్ క్రిస్మస్ సంబరాలకు ముఖ్య అతిథిగా జూబ్లీహిల్స్ శాసనసభ్యులు మాగంటి గోపినాథ్, వర్తమానికులు డాక్టర్ ప్రసాద్ పాల్ విచ్చేశారు. పాస్టర్ డేనియల్, బాబురావు, అశోక్, మార్తాదాస్, చర్చి యూత్ సభ్యులు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ జోసెఫ్ నాగేశ్వరరావు, నాయకులు ఎన్.విజయ కుమార్, విజయసింహా రెడ్డి, ఫయాజ్ ఖాన్, ఏడి మధు, రాకేస్ క్రిస్టఫర్, ఫ్రాంక్లిన్, రహమత్, వసంతరావు, బైర్ రమేష్, బాబా నాయక్ దేవమణి, రజియా, ప్రశాంత్, సరళ, సూర్యకళ, సంతోషి, శశిరేఖ, ఆరుద్ర, స్వాతి, కుమారి, పద్మ, మన్సూర్ మురళి రమేష్ నాయక్, గౌస్ భాయ్, శివకుమార్ గుప్తా, బంజారా నగర్ యాదయ్య, రజీ్వ, పాస్టర్ శిరోమణి బ్రదర్ ఆనంద్, ఇర్ఫాన్ అబ్బు, యాదన్న, ముక్రం, ఖలీల్, రజాక్ అనేక మంది దైవజనుల సంఘస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి



వర్ధంతి వేడుకల్లో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు

కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 15, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గంలో వడ్డేపల్లి రాజేశ్వరరావు కా ్యంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశ ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పుష్పాలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సమరంలో సర్దార్ పటేల్ చేసిన కృషి అపూర్వమని అన్నారు. ఆయన స్వాతంత్ర్య ఉద్యమ సమయంలోనే కాకుండా ప్రస్తుత రోజుల్లో కూడా దేశంలోని యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని అన్నారు. ఆయన ఆశయాలకై కృషి చేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓబిసి రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ గౌడ్, బీజెవైఎం స్టేట్ సోషల్ మీడియా కన్వీనర్ అక్కినపల్లి సాయి, శంకర్‌రెడ్డి, వినయ్, ఫణీంద్ర, సంతోష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### సూర్యనాయక్ మృతికి కారణమైన

## ఎస్‌ఐపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

సైఫాబాద్, డిసెంబరు 15 ప్రభాతవార్త: నల్లగొండ జిల్లాలో ఒక గిరిజనన వ్యక్తి లాకప్‌డెత్‌కు కారణమైన ఎస్ఐని తక్షణమే విధుల నుంచి తొలగించి, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని దళిత బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (డిబిఎస్‌ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఇటికాల గణేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కార్యాలయంలో ఈ లాకప్ డెత్‌పైన ఆయన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం పోలేపల్లి రాంనగర్ గ్రామపంచాయితీలోని పాలెం తండాకు చెందిన సూర్యనాయక్ అనే గిరిజనుడిని ఒక సివిల్ కేసు వివాదంలో పోలీస్‌స్టేషన్‌కు పిలిపించిన ఎస్ఐ సతీష్‌రెడ్డి అధికారం, అహంకారంతో విచక్షణారహితంగా కొట్టడంతో అతను స్పృహ కోల్పోయారని ఆరోపించారు. దీంతో గిరిజనుడిని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా సూర్యనాయక్ మృతి చెందారని వైద్యులు తెలిపారని ఆయన చెప్పారు. గిరిజనుడు మృతి చెందడానికి ఎస్ఐ కారణమని తక్షణమే అతన్ని సర్వీస్ నుంచి తొలగించి, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దళిత, గిరిజనులు కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని గణేష్ హెచ్చరించారు.

## విద్యార్థులు అన్ని విషయాలపై అవగాహన కలిగి ప్రపంచస్థాయికి ఎదగాలి

### దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి సూచన




సైఫాబాద్, డిసెంబరు 15 ప్రభాతవార్త: విద్యార్థులు అన్ని విషయాలపైన అవగాహన కలిగియుండి ప్రపంచస్థాయికి ఎదగాలని, దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ పిలుపునిచ్చారు. నేటి విద్యార్థులే రేపటి భారత భావి పౌరులని విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో దళిత బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (డిబిఎస్‌ఎఫ్) రాష్ట్ర జాయింట్ కో-ఆర్డినేటర్‌గా సి.హెచ్.శివసాయితేజను నియమించి, నియామకపత్రాన్ని అందజేసిన సందర్భంగా వడ్లమూరి మాట్లాడారు. పోటి ప్రపంచంలో విజ్ఞానంతో కూడిన చైతన్యంను కలిగియుండాలని, విద్యార్థి, యువజనులు రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డా.బి.ఆర్.అంబేద్కర్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కోట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ విద్యార్థి, యువజన నిరుద్యోగులను నిర్లక్ష్యం చేయడం వల్లనే బిఆర్ఎస్ సర్కార్‌ను ప్రజలు కూల్చడం జరిగిందన్నారు. విద్యార్థులకు పాలకులు రాజ్యాంగం కల్పించిన హక్కు లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఇటికాల గణేష్, రాంచందర్, కరుణాకర్, నిహార్, విజయ్ పాల్గొన్నారు.

## ఒయులో ఇండియా స్టార్టప్ ఫెస్ట్



ఇండియా స్టార్టప్ ఫెస్ట్ వాల్ పోస్టర్‌ను ప్రారంభిస్తున్న వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్, రిజిస్టార్ ప్రొ.లక్ష్మినారాయణ

తార్నాక, డిసెంబర్ 15 ప్రభాతవార్త: విద్యార్థులను స్టార్టప్‌లు ప్రారంభించే వారిగా తీర్చిదిద్దేందుకు రానున్న ఫిబ్రవరిలో ఉస్మానియా యూనివర్సిటీలో ఇండియా స్టార్టప్ ఫెస్ట్ 24ను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంభందించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్, రిజిస్టార్ ప్రొ.లక్ష్మినారాయణ ఇతర ప్రొఫెసర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించి, సరైన వాతావరణం నెలకోల్పేందుకు ఇండియా స్టార్టఫ్ ఫౌండేషన్ (ఐఎస్‌ఎఫ్) ఉస్మానియా ఫౌండేషన్(ఎఫ్) చేతులు కలుస్తాయని చెప్పారు. ఒ.యూలో నిర్వహించనున్న ఈ ఫెస్ట్‌లో ప్రముఖ వక్తలు, పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడి దారులు ఒకే వేదికపైకి వస్తారని వెల్లడించారు. ఓఫెఫ్, ఐఎస్‌ఎఫ్ మధ్య సంబందాల ద్వార విద్యార్థులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌ఎఫ్ వ్యస్థాపకులు డా. జేహెచ్ చౌదరి, ఓఫ్ డైరెక్టర్ డా.విజయ్ దేవరకొండ, టిఐఈ గ్రాడ్ చైర్మన్ భానుప్రకాష్ తధితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్‌ను పరామర్శించిన ఉద్యమ నేత



అప్జల్‌గంజ్, డిసెంబర్ 15 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావును గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు, ఉద్యమనేత ఆర్వీ మహేందర్ కుమార్ యశోధ ఆసుపత్రిలో కలిసి పరామర్శించారు. కెసిఆర్ తొందరంగా కొలుకుని ప్రజాక్షేత్రంలోకి రావాలని భగవంతునికి కోరుకున్నట్లు చెప్పారు.

# 22నుంచి 24వరకు 'హైదరాబాద్ కిడ్స్ ఫెయిర్'




కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీకాంత్‌టిజి తదితరులు

హైదరాబాద్, డిసెంబరు 15,ప్రభాతవార్త: డిసెంబరు 22నుంచి 24వరకు హైటెక్స్‌లో మూడురోజులపాటు "హైదరాబాద్ కిడ్స్ ఫెయిర్ "ను నిర్వహించన్నుట్లు నిర్వాహాకులు తెలిపారు. ఈమేరకు గురువారం హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హెడ్ శ్రీకాంత్ టిజి కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, జీవనశైలి, పోషకాహారం, అభిరుచులు అనే నాలుగు కీలకరంగాలపై దృష్టిపెట్టం కోసం ఈఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నామన్నారు. 100కు పైగా స్టాళ్లలో చిన్నారులకు ఉపయోగపడే అనేక ఉత్పత్తులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనిని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఐఏఎస్ అధికారి అరవింద్‌కుమార్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈఎగ్జిబిషన్‌లో పిల్లలను ఆకట్టుకునే గేమ్స్‌లు, ఇంటరాక్టింగ్ వర్క్‌షాప్‌లు, ఉత్సాహభరితమైన కళలు, క్రాఫ్ట్, ఉల్లాసమైన రోల్‌ప్లేలు, సరదా రైడ్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే ఖగోళ త్రీడీ థియేటర్, డైనోసర్ మూవి, బిన్లంగ్‌శాంటా, కాన్వాస్ పెయింటింగ్ ఫ్లూయిడ్ ఆర్ట్, డాట్ మండల వర్క్‌షాప్‌లు, స్పిన్‌ఆర్ట్ పెయింటింగ్ వంటివి చిన్నారులకు సిద్ధంగా ఉంచుతున్నామన్నారు. కావున విద్యార్థులు, తలిదండ్రులు అధికసంఖ్యలో హాజరై విజయవతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మనస్విని బండి, స్మిత చౌదరి కంకణాల, డాక్టర్ గద్దె జీవని, అఖిల భూపతిరాజు, డాక్టర్ నరేంద్రరామ్, అరుణ్‌కుమార్, మాన్య మధుసూధన్, ప్రగ్యా నయాన్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎం.వి.రమణ తదితరులు

## మేనిఫెస్టోలో పొందుపరిచిన అన్ని అంశాలను పరిష్కరిస్తాం: మంత్రి పొన్నం ప్రభాకర్

చిక్కడపల్లి, డిసెంబరు 15 ప్రభాతవార్త: రాష్ట్రంలో చేతివృత్తిదారులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి తగిన విధంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎం.వి.రమణ, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ఆశయ్య, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.కృష్ణస్వామిగౌడ్ తదితరులు మంత్రిని కలిసి అభినందనలు తెలిపారు. ప్రభుత్వానికి సహకరిస్తే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో వృత్తిదారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మంత్రిని ఎం.వి.రమణ కోరారు. మంత్రిని కలిసిన వారిలో క్షౌరవృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్లేశం, విశ్వకర్మ వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రాళ్ళబండి కుమారస్వామి, వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇ.సాయిలు, రజకవృత్తిదారుల సంఘం హైదరాబాద్ కార్యదర్శి ఎం.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## వివేకానందనగర్ బస్తీవాసుల ఇళ్లను కూల్చకుండా చూస్తా

### ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి, డిసెంబరు 15 ప్రభాతవార్త: గాంధీనగర్ డివిజన్ స్వామి వివేకానందనగర్ బస్తీవాసుల ఇళ్లను కూల్చకుండా చూడాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్‌కు శుక్రవారం బస్తీవాసులు వినతిపత్రాన్ని అందించారు. బస్తీ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లమ్, ఎం.బి.కృష్ణ మాట్లాడారు. 70 సంవత్సరాల కుపైగా బస్తీలో 23 దళిత కుటుంబాలు కూలి పనిచేసుకుంటూ జీవిస్తున్నారని, విద్యుత్తు, వాటర్ బిల్లులు కూడా చెల్లిస్తున్నామని, కానీ 2022 సంవత్సరంలో నిర్మించిన శతాబ్ది అపార్ట్‌మెంట్, ఇతర కాలనీ ఏర్పాటు అనంతరం ఇళ్ళను నిర్మించుకున్న యజమానులు కేసు వేశారని, కాగా గత వారం రోజుల నుంచి జిఎంహెచ్ఎంసి, రెవెన్యూ అధికారులు ఇళ్ళను కూల్చివేస్తామని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇళ్ళను కూల్చివేస్తే పేదలమైన తమకు డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ళు, ప్రత్యామ్నాయం చూపించాలని కోరారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్ సానుకూలంగా స్పందించారని, ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి బస్తీవాసులకు న్యాయం చేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పి.జాన్, కె.రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు

చిక్కపల్లి, డిసెంబరు 15 ప్రభాతవార్త: దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని రాష్ట్ర వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిఫరెంట్లీ ఎంప్లాయిస్ ఫెడరేషన్(ఎంబిఐడి ఇఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం పదవీబాధ్యతలను స్వీకరించిన సందర్భంగా ఫెడరేషన్ ప్రతి నిధులు కలిసి ఘనంగా సత్కరించారు. మంత్రిని కలిసిన వారిలో సంస్థ కార్యదర్శి పి.రాజశేఖర్, ఉపాధ్యక్షుడు ఆర్.స్వామినాయక్, మహేష్, వినోద్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మసి కౌన్సిల్ ఎన్నికల్లో భారీగా అవకతవకలు

### ఫార్మ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సంజయ్ రెడ్డి



ఒ.యూ ఆర్ట్స్‌కాలేజ్ ముందు మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సంజయ్ రెడ్డి

తార్నాక, డిసెంబర్ 15 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ఫార్మసి కౌన్సిల్ ఎన్నికల్లో భారీ అవకతవకలు జరిగాయని ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఫార్మా సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సంజయ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆకుల సంజయ్ రెడ్డి సొసైటీ సభ్యులతో కలిసి ఒ.యూ ఆర్ట్స్‌కాలేజ్ వద్ద శుక్రవారం మాట్లాడుతూ ఎన్నికలు నిర్వహించడంలో విఫలమైన ఆయుష్ డైరెక్టర్ హారిచందనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పిసిఐ సర్టిఫికెట్ ఫోస్టు ద్వార చేరుతుంది కాని పోస్టల్ బ్యాలెట్ మాత్రమం చేరదా అని ప్రశ్నించారు. 20వేల పోస్టల్ బ్యాలెట్‌లో 6500 రిజెక్ట్ చేయడానికి కారణాలు ఏమిటని ప్రశ్నించారు. ఆయుష్ విభాగం, తెలంగాణ రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్‌లో అనేక అవకతవకలు జరుగుతున్నాయని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అవకతవకలకు పాల్పడుతూ పూర్తిగా విఫలమైన రిటర్నింగ్ అధికారి, ఆయుష్ డైరెక్టర్ దాసరి హారిచందన, కార్యాలయ సిబ్బంది అక్రమాలపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని సంజయ్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిపిఎ రాష్ట్ర అధ్యక్షుడు కొలిపాక బాలరాజు, తేజావత్ శివకుమార్, మాడెం ప్రభాకర్, కన్నె బొయిన శ్రీనివాస్, కుంభం పాటి శ్రీకాంత్, ఎం.సతీష్‌కుమార్ తధితరులు పాల్గొన్నారు.

## అత్యవసర చికిత్స కోసం రూ.లక్ష ఎల్‌ఓసి అందించిన మేయర్



బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్‌కు చెందిన లాలయ్యకు రూ.లక్ష ఎల్‌ఓసిని అందజేస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్, అధ్యక్షుడు సురేష్‌గౌడ్‌లు

నార్సింగి, డిసెంబర్ 15 ప్రభాతవార్త : ఆసుపత్రిలో అత్యవసర చికిత్స చేయించుకునేందుకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ రూ.లక్ష ఎల్‌ఓసిని మంజూరు చేయించారు. ఈ ఎల్‌ఓసిని శుక్రవారం బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్, బిఆర్ఎస్ అధ్యక్షులు సురేష్‌గౌడ్‌లు హిమాయత్ సాగర్‌కు చెందిన లాలయ్య భార్యయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లాలయ్య మోకాలి నొప్పితో ఆసుపత్రిలో చేరారని, డబ్బులు పెద్ద మొత్తంలో కావాలని వైద్యులు సూచించడంతో మమ్ములను సంప్రదించారని, మేము ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే రూ.లక్ష ఎల్‌ఓసిని మంజూరు చేయించారన్నారు. పేదల సమస్యల పట్ల ఇంత వేగంగా స్పందించే గుణం ఉండడం వల్లనే వరుసగా ఆయనను ఇక్కడి ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపించుకున్నారన్నారు. ఈ ఎల్‌ఓ సిని అందుకున్న బాధితులు మాకు ఇంత పెద్ద మొత్తంలో సహాయం చేసినం దుకు జీవితాతం ఋణపడి ఉంటామని పేర్కొన్నారు. బాధితులకు ఆదుకో వడంలోనే అసలైన ప్రజా సేవ దాగుందని మహేందర్‌గౌడ్, సురేష్‌గౌడ్‌లు తెలిపారు.

## కన్నుల పండువగా కెడల్‌ఫెస్ట్ గిరిజనోత్సవం


నాంపల్లి, డిసెంబరు 15 ప్రభాతవార్త : జానపద గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు చర్యలు, ప్రదర్శనలు, పరిశోధనలు జరపాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు అన్నారు. ఆదివాసీ, దళిత్ ఆర్ట్స్ అండ్ లిటరేచర్ ఉత్సవాలను కెడల్‌ఫెస్ట్ పేరిట శుక్రవారం ఉదయం నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని సమావేశమందిరంలో, ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలను లాంఛనంగా ప్రారంభించి ఆదివాసీ వస్తు సంస్కృతి అంతరించిపోతున్న తరుణంలో జానపద గిరిజన పరిశోఖులు ఆచార్య జయధీర్ తిరుమల్‌రావు ఆధ్యకళ పేరిట వస్తుప్రదర్శనశాలలను నిర్వహించడం అభినందనీయమని ఆయన్ను అభినందించారు. ఈ సందర్భంగా జయధీర్ మాట్లాడుతూ భారతీయ జానపద గిరిజన ఆదివాసీల సంస్కృతిపై మక్కువతో ఫ్రాన్స్, జర్మనీ దేశాల నుండి వైవిధ్యభరితంగా జరిగే రెండురోజుల కెడల్‌ఫెస్ట్‌లో పాల్గొంటున్న అక్కడి ఆచార్యులకు కృతజ్ఞతలు తెలిపారు. జర్మనీలోని నట్టింగంట్రెంట్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ నికోల్ ధిమోరో మాట్లాడుతూ ప్రపంచ సంస్కృతి, నాగరికత గ్రామీణమూలాల నుండి వచ్చినదేనని, భవిష్యత్‌తరం దానిపైనే ఆధారపడా ఉందన్నారు. ఫ్రాన్స్‌లోని పాల్‌వెలిరోమాంట్‌తో పిల్లర్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ జోదిత్‌బరాఖ్ ఆదివాసీ సంస్కృతి ప్రాచీన నాగరికతకు చిహ్నలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య భట్టురమేష్, ఆచార్య గిరిజ, ఆచార్య విజయ్‌కుమార్‌లతోపాటు జానపద గిరిజన ఆదివాసీ కళాకారులు పాల్గొన్నారు. రెండురోజుల ఆధ్యకళ ఆర్ట్ ప్రదర్శన రేపు 10నుండి రాత్రి 7గంటల వరకు ఔత్సాహికుల కోసం తెరచివుంటుందని నిర్వాహకులు తెలిపారు. అనంతరం వివిధ అంశాలపై సదస్సులు జరిగాయి.



బండ్లగూడ కార్పోరేషన్ పరిధిలోని 18వ వార్డులో వీధి కుక్కల సమస్యను, మిగిలి పోయిన రోడ్లు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని కమిషనర్ శరత్‌చంద్రకు వినతిపత్రం ఇస్తున్న కార్పోరేటర్ గోకరి శ్రీలత సురేష్‌గౌడ్

# నేడు సాలార్‌జంగ్ మ్యూజియం 73వ వ్యవస్థాపక దినోత్సవం

### సాలార్‌జంగ్ మ్యూజియంలో ప్రత్యేక ఫోటో ప్రదర్శన



చార్మినార్,డిసెంబరు 15 ప్రభాతవార్త : సాలార్‌జంగ్ మ్యూజియం ప్రపంచంలోనే అద్భుతమైన కళాఖండాలకు నిలయంగా ఎంతగానో ప్రసిద్ధి చెందింది.పర్యాటకులకు సాలార్‌జంగ్ మ్యూజియంలో కళాఖండాలను తిలకించటానికి రెండు కళ్లు చాలవు.నిత్యం వేలాది మంది పర్యాటకులతో సాలార్‌జంగ్ మ్యూజియం కళకళలాడుతుంది. మొదటి,రెండవ సాలార్‌జంగ్‌లతో పాటు మూడవ సాలార్‌జంగ్ నవాబ్ మీర్ యూసుఫ్ అలీఖాన్ బహదూర్‌లు కలిసి మన దేశంతో పాటు ప్రపంచంలోని పలు దేశాలు నుంచి అరుదైన ఎంతో అద్భుతమైన దాదాపు 48 వేల కళాఖండాలను సేకరించారు.హైదరాబాద్ పాతబస్తీ మదీనా సమీపంలోని దివాన్‌దేవిడిలో ఏర్పాటు చేసిన మ్యూజియంలోని గ్యాలరీలో ముగ్గురు సాలార్‌జంగ్‌లు సేకరించిన కళాఖండాలను ఏర్పాటు చేశారు.అప్పటి భారత దేశ ప్రథమ ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 1951వ సంవత్సరం డిసెంబరు నెల 16వ తేదీన దివాన్‌దేవిడిలో సాలార్‌జంగ్ మ్యూజియంను ప్రారంభించారు.కాగా నయాపూల్ మూసీనది ఒడ్డున నిర్మించిన సాలార్‌జంగ్ మ్యూజియం నూతన భవనంలోకి 1968లో దివాన్‌దేవిడి నుంచి అక్కడకు మ్యూజియంను తరలించారు. సాలార్‌జంగ్ మ్యూజియంలోని గ్యాలరీలలో సందర్శకుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఇటలీ శిల్ప కళానైపుణ్యంతో రూపొందించిన రెబెక్కా పాలరాతి ముసుగు సుందరి విగ్రహం, ప్రతీ గంటకు గంటలు కొట్టే మ్యూజికల్ గడియారం,డబుల్ స్టాచ్యు విగ్రహాలను తిలకించే సందర్శకులు ఎంతో అనుభూతికి లోనవుతుంటారు.ఆధునిక కళ,పెయింట్ వస్త్రాలు, క్యాంచ విగ్రహాలు,దంతపు శిల్పాలు, ఎంబ్రాయిడరీ,కలప,వాటర్ కలర్ చిత్రాలు, చిన్న పిల్లలు గ్యాలరీలు,చైనా, జపానీస్, యురోపియన్ గ్యాలరీలో పాటు ఇతర గ్యాలరీలలో ఎంతో సుందరమైన కళాఖండాలు ఉన్నాయి.కాగా ప్రతీ సంవత్సరం డిసెంబరు నెల 16వ తేదీన సాలార్‌జంగ్ మ్యూజియం వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు.మ్యూజియం 73వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 16వ తేదీన మ్యూజియంలో ప్రత్యేక ప్రదర్శనను ఏర్పాటు చేయనున్నారు.



పాల రాతి రెబెక్కా విగ్రహం, డబుల్ స్టాచ్యు విగ్రహం

